ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
20 ఫిబ్రవరి, 2011

ENTERED



కురుల నుంచి సిరులు

2011 హ్యాపీ బర్త్‌డే

(2011 ఫిబ్రవరి 20 నుంచి
2011 ఫిబ్రవరి 26 వరకు)

శ్యామసుందర్
1సం॥, ఫిబ్రవరి-2010
చిన్నమ్మడు-లక్ష్మణరావు
విశాఖపట్నం

ఎ. జీవన్‌కిరణ్
5సం॥, ఫిబ్రవరి-22
జయమణి-చిట్టిబాబు
బొబ్బిలి-విజయనగరం

చింటు
ఫిబ్రవరి-20
పద్మజ-రాంబాబు
వైరా-ఖమ్మం

షేక్ మోసిన్ అలి
ఫిబ్రవరి-20
షాహీన్-జహంగీర్
మౌలాలి-హైదరాబాద్

వి. సంధ్య
ఫిబ్రవరి-20
రాజమణి-పెద్దులు
సీతంపల్లి-కరీంనగర్



కె. లీలా లక్ష్మితశ్రీ
1సం॥, ఫిబ్రవరి-20
గౌరి-రమేష్(ఆర్మీ)
తుమ్మికాపల్లి-విజయనగరం

జె. పూజిత్
ఫిబ్రవరి
లత-లక్ష్మణ్
ఆదర్శనగర్-హైదరాబాద్

కె. స్వాతితేజశ్రీ
ఫిబ్రవరి-22
అనురాధ-గంగాధర్‌రెడ్డి
మద్దిలపాలెం-విశాఖపట్నం

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు, పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు, తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కలర్ ఫొటో జత చేయడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి ప్లాట్ నెం. 21/1,
ఎం.హెచ్ భవన్
ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్-500 020
email-
venkateshcartoon@gmail.com

కె. అక్షర
ఫిబ్రవరి
అనూష-శ్రీను
తిమ్మపురం-నల్లగొండ

మనలో మాట

ఉత్తర్వులూ ఉత్తివేనా?



'ఎప్పటికెయ్యది ప్రస్తుత మప్పటికా మాటలాడి యన్యుల మనముల్ నొప్పింపక, తానొవ్వక, తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ...' అన్నాడు శతకకారుడు. దీనిని అక్షరాలా పాటిస్తున్నారు మన పాలక పెద్దలు. పూర్వం మాట తప్పని మనుషులు ఉండేవారట! ఒకసారి మాటిస్తే మరి తిరుగు ఉండేది కాదట! మాట తప్పటం మరణంతో సమానంగా భావించేవారట.. అలాంటి హరిశ్చంద్రుల కాలం హరించుకుపోయి చాన్నాళ్లయింది! ఇవి 'మాటంటే మాటే' అని, మాట మీద నిలబడే రోజులు కావు. ఏ స్థాయి మనుషులైనా, ఏ తీరు వ్యవహారాలైనా- 'రాత'పూర్వకంగా ఉంటేనే చెల్లుబాటు! ఈకాలంలో దేవుడు దిగొచ్చి వరమిచ్చినా- స్టాంపులూ రాతలూ సంతకాలూ సాక్షులూ ఉండి తీరాల్సిందే!

ఇది 'కలం'సాక్షిగా నడుస్తున్న కాలం అయినందున... ఎంతటి నాయకుడు హామీ ఇచ్చినా జనం నమ్మరు! ఎందుకంటే- దీనికి నేపథ్యంగా సవాలక్ష అనుభవాలు ఉన్నాయి. 'ఏరు దాటాక తెప్ప తగలేసే' పాలక పెద్దల హయాంలో - జనం నమ్మకాలు వమ్మయ్యాయి. కాబట్టే- మాటల్లో కాదు, రాతల్లో చూపండి... అని వివిధ తరగతుల కార్మికులూ ఉద్యోగులూ తమ సమస్యలపై పోరాటాలకు దిగుతారు. పాలకుల వాగ్దానాలు ఉత్తర్వుల రూపం దాల్చితే పొల్లు పోకుండా ఉంటాయని గట్టిగా నమ్ముతారు. అయితే- అలాంటి కాలానికి కూడా ఇప్పటి పాలకులు చరమగీతం పాడుతున్నారు. జీవోలకు సైతం ఎగనామం పెట్టేస్తున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంటు నుంచి వృద్ధాప్య పింఛను దాకా ఉత్తర్వులకు, ఆచరణకు సంబంధం లేకుండా పోతోంది. అక్టోబరు నుంచి 30 కేజీల బియ్యం అన్నారు రెండేళ్ల క్రితం. ఆ తరువాత అతీగతీ లేదు. పేదలకు విద్యుత్, 60 ఏళ్లు దాటితే అభయ హస్తం, అందరికీ ఇళ్లూ ఇళ్ల స్థలాలూ.... రాతపూర్వక లక్ష్యాలూ ఉత్తర్వులూ ఘనంగా ఉంటాయి. ఆచరణలో అలాంటి ఆనవాళ్లు కనపడవు. పట్టాలు ఇస్తారు... ఇళ్ల స్థలాలు చూపించరు. ఈ బాధిత వరసలో సామాన్యులే కాదు, దేశప్రతిష్టను పెంచిన క్రీడాకారులూ ఉన్నారు. సమస్య పదిమంది నోళ్లలోనూ నానుతున్నప్పుడు- పాలక పెద్దలు నష్టపరిహారాలూ, ఆర్థిక సహాయాలూ ఘనంగా ప్రకటిస్తారు. తరువాత దిక్కూ దివాణమూ ఉండదు. ఉదారంగా ఇచ్చిన ఉత్తర్వులు చిల్లపెంకులైపోతాయి!

కాంట్రాక్టు ఉద్యోగులూ, కార్మికుల సమస్యపైనా ఇదే తంతు! ఒకసారి ఉద్యమిస్తే- గత్యంతరం లేదన్నట్టు జీతాల పెంపు ప్రకటన చేస్తారు. సమస్యల పరిష్కారంపై రాతపూర్వక సన్నద్ధత వ్యక్తం చేస్తారు. ఆందోళన ముగిసి, నెలలూ సంవత్సరాలూ గడుస్తాయి. ఒప్పందాల అమలు ఊసే ఎత్తరు! దీంతో, కడుపు మండిన కార్మికులు గత్యంతరం లేక ఉత్తర్వుల అమలు కోసం మళ్లీ ఉద్యమించాల్సిన పరిస్థితి!

'అవసరమైనప్పుడు ఏమైనా చెబుతాం... ఏదైనా చేస్తాం... అవసరం లేనప్పుడు ఎలాగైనా ప్రవర్తిస్తాం. ఎంతకైనా తెగిస్తాం...' ఇదీ, మా పద్ధతని పాలకపెద్దలు చెప్పకనే చెబుతున్నారు. 'గుర్తె'రిగి వాత పెడితే తప్ప దారిలోకి రారు! ఆ చికిత్స చేయాల్సింది జనమే... అంటే మనమే..!

★

ఈ సంచికలో....

టపా	...	2
వికాసం	...	3
కవిత్వమ్	...	6
సినిమా కబుర్లు	...	8
నవ్వుల్ పువ్వుల్	...	10
కొత్త పుస్తకాలు	...	11
అట్టమీది కథ	...	14
రుచి	...	17
తెల్సా	...	20
ఈ పేజ్	...	21
బాలనేస్తాలు	...	22
మాటలకోట	...	24

ఇంకా...

అమ్మ భాష అమృతం....4



చూద్దామా ... 12

ఆంగ్‌కోర్ వాట్

కథ ... 18

చిన్న కోరిక



అట్టమీది కథ బాగుంది

ఈ వారం కవర్‌స్టోరీ 'నవరసాల బాటసారి' పద్మతేజం నాగేశ్వరరావు నటనా ప్రతిభ కు నిదర్శనం. సాంఘీక, చారిత్రాత్మక, పౌరాణిక చిత్రాల్లో, రొమాంటిక్, విషాద సన్నివేశాల్లో అక్కినేని నటనను ఎన్నటికీ మరువలేం. ఈ ఎవర్‌గ్రీన్ హీరోకు లభించిన పురస్కారాలు చెప్పతరం కాదు. నేటి సినీ తారలందరికీ అక్కినేని ఆదర్శప్రాయుడు.

నూతి నారాయణరావు,
గడ్డిఅన్నారం, హైదరాబాద్.

అప్పుడే అయిపోయిందా?

'ఈ పేజీ' ద్వారా కంప్యూటర్ వాడకం ఎంత వరకు ఉండాలో, ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో చక్కగా వివరించారు. 'వియత్నాం వీరుడు' సీరియల్ అప్పుడే అయిపోయిందా అనిపించింది. ఈ సీరియల్ ఉత్కంఠభరితంగా, ఆసక్తికరంగా చాలా బాగుంది. 1.5 మిలియన్ డాలర్ల గౌను అమ్మో...! అనేలా ఉంది. అలాగే సాలెగూడు కూడా ఔరా అనిపించింది. 'మనలో మాట' బాగుంది. నిజంగానే ఎదుటి వాడికి నీతులు చెప్పేవారు తమ దాకా వచ్చే సరికి అన్నీ మర్చిపోయి గుమ్మడికాయ దొంగలా భుజాలు తడుముకుంటారు.

విజయ్, గుంటూరు.

కవితా ప్రయోగం

జనవరి 30 సంచికలో 'మనలోమాట' రచ్చబండ రాజకీయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి ప్రజలకు కొత్త హామీలు ఇవ్వడానికి ఏమీ మిగల్లేదని, క్రితం ముఖ్యమంత్రులిచ్చిన హామీలను ఆచరించడమే వీరిపని అని చక్కగా సూచించారు. చిత్తలూరి సత్యనారాయణ గారి కవిత 'రోల్ నెం.16' ప్రయోగాత్మకంగా ఉంది. బాలకార్మిక వ్యవస్థలో బంధించబడిన బాల గులాబీల బాధల వర్ణన అద్భుతంగా ఉంది. వినోద భరిత చిత్రాలకు తన సొంత మార్కు చిత్రాలుగా గుర్తింపు తెచ్చుకున్న ఇవివి సత్యనారాయణ లేని లోటు తీరదంటూ రెంటాల జూనియర్ వివరించిన వ్యాసం బాగుంది. 'మంచుదుప్పటి' వ్యాసం కాశ్మీర్ వయ్యారాలు, సరస్సుల గురించి వివరణాత్మకంగా ఉంది. డా॥కాకర్లమూడి విజయ్‌గారి కవర్‌స్టోరీ 'శవసేవలు' చాలా ఆశ్చర్యంగా అనిపించినా కొత్త సమాచారం అందించింది. ఇంకా ఈ వారం నవ్వుల్ - పువ్వుల్, తెల్సా, బాలల పేజీ, ఎడబాటు కథ బాగున్నాయి.

భైరి సత్యనారాయణ, కొత్తగూడెం.



సద్విమర్శ

జనవరి ఆఖరి వారం సంచికలో అట్టమీది కథగా వచ్చిన 'శవసేవలు' అంశం విస్తుపోయేలా చేసింది. శభాష్ శాండీ చదివాక అలాంటి ఒక శునకం తోడుంటే చాలనిపించింది. 'ఈ పేజీ' ద్వారా తెలుగు కింగ్‌డమ్.నెట్ విశిష్టత తెలిసింది. బాలనేస్తాలు పేజీలు కాలక్షేపాన్నిస్తోంది. సినిమా పేజీల ద్వారా ఇవివి గార్ని మా జ్ఞాపకాల్లో కదలాడేలా చేశారు. ఆయన పరమపదించినా ఆయన గురించి సద్విమర్శనాత్మకంగా అనేక నిజాలను చెప్పడంలో జూనియర్ రెంటాల కృతకృత్యులయ్యారు. 'నవ్వుల్ పువ్వుల్' ఇంకొంచెం హాస్య రసాన్ని చిలికించాల్సి వుంది. 'మంచు దుప్పటి' అంటూ కాశ్మీర్ అందాలను చూపించారు. 'తెల్సా' పేజీలో సీసాల మ్యూజియం, చాక్లెట్ కట్టడాలు ఆశ్చర్యచకితుల్ని చేశాయి. బాల కార్మికుల వెతలను 'రోల్ నెంబర్ 16' ద్వారా ప్రస్తుతించడం బాగుంది. 'కొత్తపుస్తకాల' పరిచయం ద్వారా కొత్త కొత్త పుస్తకాలను తెలుసుకోగలుగుతున్నాం. 'రచ్చబండ' రక్షబండో... రేవు బండో కాలమే చెప్తుంది.

నేమాన సుభాష్ చంద్రబోస్,
శ్రీకాకుళం.



ఎన్నో విషయాలు తెలిపిన నానీలు

కొండపల్లి నీహారిణి గారి నానీలు ద్వారా చాలా విషయాలు తెలుసుకున్నాం. మన దేశంలో పిల్లలను బేబీకేర్ సెంటర్లలో చేర్పిస్తుంటే, అమెరికాలో ఇంటికే వచ్చి పిల్లల ఆలనా పాలనా చూడడం బాగుంది. ఇంకా అక్కడ డే టు డే రిపోర్టులు ఇవ్వడం కూడా బాగుంది. అలా వుంటే తల్లిదండ్రులకు తమ పిల్లల గురించి భయపడాల్సిన పని వుండదు. అట్టమీది కథలో అక్కినేని నట జీవిత విశేషాలు బాగున్నాయి. దాంతోపాటు ఆయనది చిన్న ఇంటర్వ్యూ కూడా ఇస్తే బాగుండేది.

నరసింహగౌడ్, ఖమ్మం.

కాదేదీ అనర్హం

వినోదభరిత చిత్రాలకు చెరగని సంతకం ఇ.వి.వి. సత్యనారాయణ. ఆయన గురించి జూనియర్ రెంటాల చక్కని వ్యాసం అందించారు. హాస్య కథా చిత్రాలే కాదు, ఆమె, అమ్మో ఒకటో తారీఖు వంటి కుటుంబ కథా చిత్రాలు కూడా తీసి మధ్యతరగతి ప్రేక్షకుల ఆదరణని సంపాదించుకున్నారు. కవర్ స్టోరీలో ఫ్యునరల్ ఎంబిఎ కోర్సు గురించి చదివాక కాదేదీ చదువుకు అనర్హం అనిపిస్తుంది.

మార్టూరు అజయ్ కుమార్,
చిలకలూరిపేట.

★

వికాసం

పద్మనాభంగారికి ప్రతిదీ లెక్కగా వుండాలి. లేకుంటే కోపం వచ్చేస్తుంది. ఖర్చు చేసే ప్రతి పైసాకు లెక్క చెప్పాలంటారు. తనూ అలాగే వుంటారు. సాయంత్రం వేళ తీరిగ్గా కుర్చీలో కూర్చుని ఆ రోజయిన ఖర్చులన్నిటినీ ఓ పుస్తకంలో రాసుకుంటారు. ప్రతిరోజూ జరిగే ఈ తంతు ఇంట్లో వాళ్లకి విసుగ్గాను, ఇరుగుపొరుగుకు విచిత్రంగాను వుంటుంది. 'ఆ అలవాటు మానుకోండి నాన్నగారూ...కుటుంబ సభ్యులకోసం ఖర్చు చేసింది లెక్కలు చూసుకుంటారా ఎవరైనా?' అని పిల్లలు అడుగుతుంటారు. ఆయన మాత్రం వాటిని పట్టించుకోకపోగా...'మన ఖర్చు ఎప్పుడైనా సరే బడ్జెట్ దాటకుండా వుండాలీ అంటే ఈ లెక్కలు అవసరమోయ్' అనేవారు. దాంతో ఆయనకు బడ్జెట్ పద్మనాభం అని బిరుదు వచ్చేసింది. తమాషా ఏమంటే ... విచిత్రంగా చూసిన ఆ ఇరుగుపొరుగుకు అత్యసర సమయాల్లో ఈయనే సాయం చేసేవారు. అందుకే! పద్మనాభంగారే కాదు! ప్రతి ఒక్కరూ నెలసరి బడ్జెట్ వేసుకుని దాని ప్రకారం నడుచుకోవాల్సిందే. లేకపోతే లోటు బడ్జెట్‌లో పడిపోతుంది వ్యవహారం.

లెక్క లెక్కే

పద్మనాభం లాంటి వారిని చూచినప్పుడు కూసింత ఆశ్చర్యంగానే అనిపిస్తుంది. కానీ ఆయన చేసే పనిలో ఒక లాజిక్ వుంది. రోజు ముగిశాక ఖర్చులు రాసుకొని పరిశీలించడంలో ఓ ప్రయోజనం వుంది. తాగిన కూల్‌డ్రింక్ మొదలుకొని ఉప్పు, పప్పు వరకు ప్రతిది ఖర్చు రాసి చూడడం వల్ల ఏది అనవసరపు ఖర్చో, ఏది అవసర ఖర్చో మనకు తెలిసిపోతుంది. పైగా ఖర్చు చేసేప్పుడు ప్రతిదీ అవసరమైనదిగానే కనిపిస్తుంది. ప్రధానమైనదిగానే అగుపిస్తుంది. తీరా లెక్క రాసుకొని చూస్తేనే అసలు విషయం బోధపడుతుంది. 'ఓస్..ఇక్కడ డబ్బులు వృధాగా ఖర్చు పెట్టేశామే. కాస్త ఆలోచించి వుంటే ఈ డబ్బు మిగిలేది సుమా' అని మన నోటెంట వచ్చేస్తుంది. అప్పుడు ఆ పొరపాటు, ఆ అనవసరపు ఖర్చు మరోసారి చేయకుండా జాగ్రత్త పడతాం. బడ్జెట్ దాటిపోకుండా ఖర్చు వేగానికి కళ్లెం వేయగలుగుతాం.

ఫిబ్రవరి, మార్చి వచ్చిందంటే చాలు ఎక్కడ విన్నా బడ్జెట్ కబుర్లే వినిపిస్తాయి. అటు అసెంబ్లీలోను, ఇటు పార్లమెంటులోను ఏడాది బడ్జెట్ ప్రవేశపెడుతుంటారు నేతలు. రాష్ట్రానికి, కేంద్రానికే కాదు...మన ఇంటికీ బడ్జెట్ అవసరమే. విషయాన్ని ఇంత సీరియస్‌గా చెప్తోంటే 'అసలు బడ్జెట్ అంటే ఏంటీ?' అనడిగేవారూ వుంటారు. పాపం తెలీకే అనుకోండీ!

బడ్జెట్ అంటే అదేదో బ్రహ్మపదార్థం అనుకోనవసరం లేదు. సింపుల్‌గా చెప్పుకోవాలంటే ఆదాయవ్యయాల అంచనా. ఏ ఏడాది ఖర్చు ఎంత అవుతుంది? ఆదాయం ఎంత వస్తుంది? వచ్చిన డబ్బును దేనికి ఎంత ఖర్చు చేయవచ్చు? ఆ డబ్బును ఏ పద్దు కింద ఎంత ఖర్చు చేయాలనుకుంటే అంత డబ్బును ఆ శాఖలకు కేటాయించడమే బడ్జెట్ అంటే. బడ్జెట్ ప్రభుత్వాలకే కాదు. మనకూ వుంటుంది. పెళ్లిళ్ల, పుట్టినరోజులు, ఇంటి నిర్మాణం... వంటి వాటన్నిటికీ బడ్జెట్ వేసుకుంటాం. ఉదాహరణకు పెళ్లినే తీసుకోండి. చీరలకు, బంగారానికి, భోజనాలకు, వివాహ వేదికకు, కొత్త కాపురానికి కొనబోయే వస్తువులకు...ఇలా ఇంత డబ్బు అని అనుకుంటాం. అంతలోనే ఆ ఖర్చు ముగించడానికి ప్రయత్నిస్తాం. ఒకవేళ దాన్ని మించి ఖర్చు చేశామో! అవస్థలు పడిపోతాం. అప్పులకు వెళ్లాల్సి వస్తుంది. లేదా వేరే ఖర్చుకోసం కేటాయించిన డబ్బును దీనికోసం వెచ్చించాల్సి వస్తుంది.

ఇంటి బడ్జెట్

ప్రతి ఇంట్లోనూ నెలవారీ బడ్జెట్ వేసుకుంటుంటాం. ఆ నెలలో వచ్చే ఆదాయం ఎంతో, ఖర్చులేంటో చూసుకుంటాం. ఆదాయాన్ని బట్టి, దేనికెంత ఖర్చు చేయాలో రాసుకుంటాం. పాలు, కూరగాయలు, పచారీ సరకులు, పిల్లల స్కూలు ఫీజులు, సినిమాలు, షికార్లు... పెద్దల ఆరోగ్య ఖర్చు... ఇలా ముందే దేనికెంతో బడ్జెట్ వేసుకుంటాం. కొన్ని అనుకోని ఖర్చులూ తగులుతుంటాయి. అప్పుడు ముందుగా కేటాయించిన ఖర్చులను మానుకొనో, తగ్గించుకొనో అత్యవసరాలకు కేటాయిస్తాం. ఆదాయం తక్కువగాను, ఖర్చు ఎక్కువగానూ వుంటే లోటు బడ్జెట్ అవుతుంది. ఆ లోటు పూడాలంటే అప్పు చేయాలి. ఏదైనా లోన్‌కోసం ప్రయత్నించాలి. మరేదైనా ఆదాయ మార్గం వుందేమో అన్వేషించాలి. లేదా ఉన్నదాంట్లోనే పొదుపు చేసి లోటు పూడ్చాలి. ఒక్కోసారి ఎంత పొదుపు చేద్దామన్నా కుదరదు. ఎవరికైనా అనుకోకుండా వైద్యం కోసం ఖర్చు చేయాల్సి రావచ్చు. అప్పుడు అప్పుల కోసం పరుగెత్తినా అందకపోవచ్చు. అందుకే ఇలాంటి ఖర్చులకోసం ఏవైనా పాతబకాయిలు మన చేతికి వచ్చినప్పుడు బ్యాంకులో దాచిపెట్టుకోవడం మంచిది. అలాగే అనవసరపు ఖర్చులను అదుపు చేసుకుంటే అంటే నెలకు ఇంతని పొదుపు చేసుకుంటే అవసరమైన వస్తువులు ఖరీదైనప్పటికీ కొనుగోలు చేసుకోడానికి వీలవుతుంది. ఆ ఆలోచన లేకుండా ఏ నెల ఆదాయాన్ని ఆ నెలలోనే ఖర్చు చేసేస్తే మనకు మిగిలేది అసంతృప్తే. ఓసారి ఇంట్లో చూసుకుంటే బోసిగా కనిపిస్తుంది. ఏం వెనకేసుకున్నాం అనుకుంటే ఏమీ కనిపించదు. అందుకే ఎప్పటికప్పుడు బడ్జెట్ వేసుకుంటూ భవిష్యత్ ఖర్చులకోసం కూడా కూడబెట్టుకుంటే సంసార నావ సాఫీగా సాగిపోతుంది.

- సాహిల్

అమ్మ భాష అమృతం



1947లో భారత్ విభజన వేళ తూర్పు బెంగాల్ ప్రాంతం పశ్చిమ పంజాబ్‌లాగే పాకిస్తాన్‌లోకి వెళ్లిపోయింది. తూర్పు పాకిస్తాన్‌గా గుర్తింపబడిన ఆ ప్రాంతానికీ పాకిస్తాన్‌కి మధ్య మొదటినుండీ ఆర్థిక, సాంస్కృతిక, భాషాపరమైన సంఘర్షణలే! ఉర్దూను మాత్రమే అధికార భాషగా గుర్తించడంలో పాక్ బెంగాలీలు తమ భాషకూ ఆ గౌరవం దక్కాల్సిందేనని ఉద్యమం ఆరంభించారు. అది హింసాయుతంగా మారి ఢాకా విశ్వ విద్యాలయానికి చెందిన నలుగురు విద్యార్థులు బలికావడంతో పాక్ ప్రభుత్వం ఒక మెట్టు దిగివచ్చి 1956 ఫిబ్రవరి 29న బెంగాలీని కూడా మరో అధికార భాషగా గుర్తించింది. తర్వాతి కాలంలో బంగ్లాదేశ్ ఆవిర్భవించింది. ఈ కారణంగానే ఫిబ్రవరి 21వ తేదీని ఐక్యరాజ్య సమితి యునెస్కో "అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం"గా ప్రకటించింది.



-కర్లపాలెం

గత శతాబ్దం చివరి దశాబ్దంలో యునెస్కో ప్రపంచానికి భాషల విషయమై ఒక తీవ్రమైన హెచ్చరిక చేసింది. ప్రపంచంలోని 6500 పైగా ఉన్న భాషల్లో సగానికి పైగా తమ ఉనికిని కోల్పోయే ప్రమాదం ముంచుకొస్తుందన్నదే ఆ హెచ్చరిక సారాంశం. మాతృభాష నశిస్తే జీవ వైవిధ్యం నశిస్తుంది. మానవ జాతి తన మౌలిక లక్షణాన్ని కోల్పోతే వికాసం దెబ్బతిని మనుగడకే పెద్ద ప్రమాదమన్న ఆ హెచ్చరిక తీవ్రతను ప్రపంచం అర్థం చేసుకుంది. భాషా శాస్త్రవేత్తల అంచనా ప్రకారం గత మూడు వందల సంవత్సరాల్లో ఒక్క అమెరికా, ఆస్ట్రేలియాలలోనే అనేక మాతృభాషలు అంతరించిపోయాయి. ఈ ప్రమాదాన్ని నివారించే దిశగా యునెస్కో ప్రకటించిన ఈ మాతృభాషా దినోత్సవాన్ని "మాతృభాషల పరిరక్షణ దినం"గా కూడా ఇప్పుడు ప్రపంచ దేశాలు పాటిస్తున్నాయి. తమ తమ దేశాల్లోని భాషల పునఃపరిపుష్టికి ప్రణాళికలు రచించుకుని చిత్తశుద్ధితో అమలు చేసే పనిలో పడ్డాయి. మాతృభాషల పరిరక్షణ అనేది ప్రజల జాతీయ, పౌర రాజకీయ, సాంఘిక, ఆర్థిక సాంస్కృతిక హక్కులలో అంతర్భాగంగా యునెస్కో నిర్ధారించడం ఈ భాషా పరిరక్షణ ఉద్యమాలకు మరింత ఊతం ఇచ్చినట్లయింది. కనీసం ముప్పై శాతం మంది పిల్లలు రెండు తరాల పాటు తమ మాతృభాషను నేర్చుకోవడం మానేస్తే ఆ భాష ఉనికి ప్రమాదంలో పడినట్లేనని భాషా శాస్త్రవేత్తల భావన. ఆ లెక్కన సుమారు ప్రపంచ వ్యాప్తంగా 15 కోట్ల మంది మాట్లాడే మన తెలుగుకి కూడా ముప్పు ముంచుకొస్తున్నట్లే లెక్క.

ఆరు లక్షల పైచిలుకు పద సంపదున్న అందమైన 'అజంత' భాష మన తెలుగు. ప్రపంచ భాషలతో ఒక్క ఇటాలియన్‌కి తప్ప మరిదేనికీ లేని విలక్షణత్వం ఇది. అందుకే అందరి చేతా "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్" అని పొగడ్తలందుకుంది.పల్లె పదాలలో శ్రమ జీవుల పాటలలో ప్రతిధ్వనించిన సజీవ భాష తెలుగు. క్రీస్తుశకం ఒకటో శతాబ్దంనాటికే శాతవాహన చక్రవర్తి హాలుడు తన "గాథాసప్తశతి"లో తెలుగు పద ప్రయోగం చేసిన చరిత్ర మన తెలుగు భాషది. ప్రపంచ భాషల్లో కథానిక ప్రక్రియ మొదలయింది మన గుణాఢ్యుడి తెలుగు "బృహత్కథ"తోనే. 'ప్రతి ఉచ్చరణకీ ఓ ప్రత్యేకాక్షరం ఉన్న అత్యంత అరుదైన భాష తెలుగు' అని హాల్డెన్ దొరగారే మన భాషను ఆకాశానికెత్తేశారు. తెలుగువాడుగా పుట్టనందుకు అప్పయ్య దీక్షితులు చాలా చింతించారు. తమిళం మాతృభాషయినా అనేక మంది భాషా పండితులు, కవులు తన కొలువులో ఉన్నా శ్రీకృష్ణదేవరాయలు తెలుగు కలకండ లాంటి తీయని పలుకుగల భాషని ప్రత్యేకమైన అభిమానం చూపించాడు. 'ఆముక్తమాల్యద' అనే పద్యం తమిళ సంస్కృతికి సంబంధించిందే అయినా తెలుగులోనే రాయబూనుకున్నాడు. "దేశభాషలందు తెలుగు లెస్స" అన్న తన ముందు కవుల అభిప్రాయాన్నే నిర్ధారించిన గొప్ప భాషాభిమాని శ్రీకృష్ణదేవరాయలు. శ్రీ వేంకటపతి భక్తుడైన అన్నమాచార్యుల వారి భావుకతకు దీటైన 32 వేల పద సంకీర్తనలను అందించగల చేవ మన తెలుగు భావ సంపదదే. త్యాగయ్య నాదమయ రామకథా రాగ సుధా సంగీతార్ణవంలోని సప్తస్వరాల క్షీర మాధుర్యం తెలుగక్షరాలోనే కదా ధారలు కట్టింది. మాధవ స్వామికి క్షేత్రయ్య వంటి మహానుభావుడు అందించిన మధుర భక్తి మాలలోని చందన పరిమళాలు తెలగక్షరాలవే గదా! పోతన అచ్చ తెలుగు పదాల పూత, యోగి వేమన వైరాగ్య భావ గంభీరత, మహాకవి అభ్యుదయ కవితా ఖడ్గ అంచుల తళతళ, నన్నె చోళుని నుండి నవయుగ కవి చక్రవర్తి జాషువా దాకా, కవిత్రయం నుండి కృష్ణశాస్త్రి దాకా ఎందరెందరో మహానుభావుల కలాలకు బలాన్నిచ్చినవి ఈ తెలుగక్షరాలే. "జాను తెనుగే మేము – జాతి ఘనతే మేము" అంటూ మల్లాది రామకృష్ణ శాస్త్రి వంటి వారు మోగించిన ఆ తెలుగు ఢక్క మోత... వర్తమానంలో బుడబుక్కల వాడు డప్పు మోత కూడా శబ్దం చేయడం లేదు. ఏవి మన గురజాడ వేసిన అడుగు జాడలు? ఏవి వ్యవహారిక భాష కోసం ఆనాడు గిడుగు వారు కురిపించిన పిడుగులు? కందుకూరి వినిపించిన సమరభేరి ఉత్సాహం చప్పబడిపోవడమే ఇప్పటి మన విషాదం.

భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం ఆరాటపడి మొదటగా సాధించుకున్న మనం ప్రస్తుతం మన మాతృభాషకు ఇస్తున్న మన్నన చూస్తే మనసు కలుక్కు మనక మానదు. చక్రవర్తుల రాజ్యాంగాలను నడిపించిన మన భాష పరాన్న భుక్కునిగా మారడాన్ని భాషాభిమానులు జీర్ణించుకోలేని దుస్థితి. మన తెలుగు మాటే మనకు ఇప్పుడు పరమ మోటు! 'అన్య భాషలు నేర్చి ఆంధ్రంబు రాదంచు' సకిలించడం పెద్ద ఫ్యాషనైపోయింది. తెలుగు నాట తెలుగుని అధికార భాషగా గుర్తించడానికి ఆంధ్ర రాష్ట్ర అవతరణ తర్వాత పదేళ్లు పట్టింది. ప్రభుత్వ శాఖల్లో తెలుగు అమలుకు, ప్రభుత్వ వ్యవహారాలన్నీ తెలుగులోనే సాగాలన్న సంకల్పానికీ ఆరు దశాబ్దాలు దాటుతున్నా సంపూర్ణ గ్రహణం వదలలేదు. తెలుగు ప్రజలకు ప్రతినిధులుగా చట్టసభల్లో కూర్చుంటున్న వారిలో చాలా మందికి తడబాటు లేకుండా పట్టుమని పది నిమిషాలు కూడా తెలుగులో మాట్లాడలేని పరిస్థితి. పొరుగు రాష్ట్రాల తెలుగువారు తమ మాతృభాషమీది మమకారంతో వ్యయ ప్రయాసలకోర్చి సభలు జరుపుకుంటుంటే ప్రభుత్వం తరపున ఒక్కరైనా చివరిదాకా హాజరు కాని పరిస్థితిని చూస్తే వేదన కలగ కుండా ఉంటుందా? తమిళ సోదరులు తమ భాష ప్రాచీనత హోదా కోసం అవిశ్రాంతంగా పోరాడి సాధించుకున్న తర్వాత గానీ మన పాలకులకు తెలుగు చరిత్ర గుర్తుకురాకపాయ! తెలుగు భాషోన్నతికి పాటుబడాల్సిన తెలుగు అకాడమీ పేరులోనే సగం తెలుగుదనం తరిగిపోయిన వైనం హాస్యాస్పదంగా లేదా! రాష్ట్రరాజధాని నడిబొడ్డునున్న తెలుగుతల్లి విగ్రహం మీద తెలుగక్షరాలు చెక్కించుకోడానికి భాషాభిమానులు పెద్ద ఉద్యమమే చెయ్యాల్సి వచ్చింది! బ్రిటీష్ వారు తమ పరిపాలనా కాలంలో కనీసం ఆంగ్లో వెర్నాక్యులర్ స్కూళ్లనన్నా పెట్టారు. నిజాం రాజు కనీసం మిడిల్ స్కూలు వరకైనా తెలుగును అనుమతించాడు. మరి మనం ఎన్నుకున్న ప్రభువులో... ప్రాథమిక విద్య స్థాయి నుంచే మాతృభాషను నిర్లక్ష్యం చేసే ప్రణాళికను పట్టుదలతో అమలు చేస్తున్నారు! సక్సెస్ పాఠశాలల పేరుతో నిన్న చేసిన ఆంగ్ల మాధ్యమ ప్రయోగం వికటించినానూ... మళ్లీ ఈ ఏడాది నుంచీ ఒకటో తరగతి నుంచే పసిపిల్లల మెదళ్ల మీద పరభాషా అయోమయాన్ని రుద్దే ప్రయత్నం ఆరంభించారు. తెల్లవారు తమ పాలనలో నాణేల మీద వేరే భాషలతో సమానంగా తెలుగులో కూడా ముద్రించిన స్థితి నుంచీ... నేటి మన పాలకులే మన భాషనే ప్రాథమిక స్థాయి దాకా కూడా అందించడానికి ఇష్టపడని రాజుల దాకా మనం తిరోగమించాం.

'చందమామ రావే.. జాబిల్లి రావే..' అంటూ చంకలోని చంటి పాపాయిలకు గోరు ముద్దలు తినిపిస్తూ అమ్మ పాడే ఆ పాటల కమ్మదనం ఎప్పుడో కొండెక్కిపోయింది. ఆరు బయట వెన్నెల్లో కూర్చుని అమ్మమ్మలు, తాతయ్యలు పిల్లలకు వినిపించే ఆ తెలుగు నీతి కథలు కంచి నుండి ఇంకా తిరిగి రానే లేదు. అమ్మ - మమ్మీగా, నాన్న - డాడీగా ఏనాడో పరాయీకరణ చెందిపోయారు. అంకుల్, ఆంటీ తప్ప నోరారా ఆప్యాయంగా అత్తయ్యా, మామయ్యా అంటూ పిలిచే పిల్లలిప్పుడు తెలుగు నేలమీద లేరు. తెలుగు తెలియకుండానే, తెలుగు చదవకుండానే రెండు తరాల నుండి మన పిల్లలు కళాశాలల నుండి బయటకొచ్చి పెద్దపెద్ద ఉద్యోగాలు చేస్తున్నారు! పాన్ డబ్బాల నుండీ పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ దాకా ఏ దుకాణం బోర్డుమీద చూసినా తెలుగు అక్షరం కనిపించదు. తెలుగు సినిమాల్లో, తెలుగు ఛానళ్లలో వినిపించే తెలుగును గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. ఆంగ్లంలో వర్ణక్రమాలు తప్పుల్లేకుండా గడగడా ఒప్పజెప్పి కప్పులు కొట్టుకొచ్చే మన తెలుగు పిల్లలు తెలుగు పత్రికలోని ఒక్కపేజీని తడబడకుండా చదవమంటే గజగజా వణికి పోతున్నారు! తల్లిదండ్రులు కూడా తమ సంతానం పుట్టినప్పట్నించే అమెరికా సంస్కృతికి వారసులుగా మాత్రమే పెరగాలని మోజు పడుతున్నారు. బడిలో తెలుగు మాట్లాడినందుకు మెడలో పలకలు వేలాడదీసి శిక్షిస్తున్నా తప్పు పట్టని కన్నవారే ఎక్కువ మంది ఉన్నారు. ఎంత భారీ ఫీజులైనా ఆంగ్లంలో మాత్రమే బోధించే హైటెక్ పాఠశాలల వైపే మొగ్గు చూపుతున్నారు. రోమ్‌లో లేకపోయినా సరే రోమన్‌లాగే ఉండాలని మోజుపడే విచిత్ర మనస్తత్వం ఇవాళ తెలుగు నాట అంతటా పరుచుకునిపోయింది. రామదాసు కనుక ఈనాడు జీవించి ఉంటే పలుకే బంగారమాయెరా! అని పాడడానికి బదులు 'తెలుగు పలుకే బంగారమాయెరా!' అని పాడి ఉండేవాడే! రాజుని మించి రాజభక్తిని చూపించే మన జనాలని చూసి ఇరుగు పొరుగు రాష్ట్రాల వారు ఎలా నవ్వుకుంటున్నారోనని కూడా మనకు పట్టడం లేదు. వారిని చూసైనా మనం మారాలని అనుకోకపోవడమే నేటి దౌర్భాగ్యం.

మారుతున్న కాలంలో సాంకేతిక విద్యకు అనుకూలం కనుక ఆంగ్ల భాషను అభ్యసించడం అవసరమే అన్నంత వరకూ ఎవరికీ అభ్యంతరం ఉండవలసిన పనిలేదు. దానికోసం చిన్నారులను ముక్కుపచ్చలారని వయసులోనే మాతృభాషకు దూరం చేయడమే నేరం. అమ్మ ఒడిలో అమ్మ భాషను నేర్చుకుంటూ పరిసరాలను, ఇంటి వాతావరణాన్ని అవగాహన చేసుకునే చిన్నారి... పాఠశాలలో దానికి పూర్తిగా విభిన్నంగా ఉన్న ధోరణితో సమన్వయం చేసుకోలేక మానసికంగా ఎంత నలిగి పోతాడో పెద్దలు అర్థం చేసుకోవడం లేదు. అమ్మ ఒడి నుంచే అమ్మ భాషను తృణీకరించే తత్వాన్ని అలవాటు చేస్తే వాళ్లు పెరిగి పెద్దయిన తరువాత అమ్మ సంస్కృతినీ, అమ్మానాన్ననూ ఆదరించే వాడుగా ఎలా తయారవుతాడు? భాష, విద్య ఒక్క ధనార్జనకే అనే విద్యావిలువలను కన్నవారే వంట బట్టిస్తే, వాడు జీవితంలో ముందు ముందు వేసే ప్రతి అడుగులోనూ డాలర్ల దర్శనమే పరమార్థంగా భావించడా! ప్రపంచీకరణ ప్రభావంతో అవసరానికి మించిన సంపాదనకోసం వెంపర్లాడుతూ మనిషితనాన్ని పోగొట్టుకోవడమే మనం మన తర్వాతి తరాలకు ఈ పరాయి భాష మీది మోజును పెంచడం ద్వారా నేర్పిస్తున్నది. మనం చేజేతులా ఏం కోల్పోతున్నామో కోల్పోయిన తర్వాత తెలుసుకుని ఒరిగేదేముంది? బాల్యం నుండే ఆంగ్లం నేర్చుకున్నవారందరూ పెద్ద పెద్ద ఉద్యోగాలు చేస్తారన్న భరోసా ఏమీలేదు. ఇవాళ పెద్ద పదవులలో ఉన్న వారెందరో చిన్నతనంలో చిన్న బళ్లో గుంట ఓనమాలు దిద్దుకుని పైకొచ్చినవారే! వ్యక్తి ఉన్నతికి ప్రతిభే ప్రధాన కారణమవుతుంది. ప్రతిభ పరిసరాల నుంచి ప్రభావితమవుతుంది. పరాయి సంస్కృతి నుండి నేర్చుకునేదానికన్నా సహజ వాతావరణంలో నుండి గ్రహించడం సులభంగా ఉంటుంది. మనోవికాసానికి మాతృభాషే ప్రధాన హేతువుగా ఉంటుందని మానసిక శాస్త్రవేత్తలు, భాషా శాస్త్రవేత్తలు కూడా మొత్తుకుంటున్నారు. అయినా ఈ వ్యాపార ప్రపంచంలో కన్న బిడ్డను లాభాలార్జించి పెట్టే పెట్టుబడిగా భావించడం మన తల్లిదండ్రులు మానడం లేదు. ఒక్క తెలుగునాటే ఈ పెడసరి పోకడలు మరీ మితిమీరిపోవడం దురదృష్టం.

పొరుగునున్న తమిళనాడులో ఆంగ్ల భాష ద్వారా వచ్చే అవకాశాలను ఒక వంక అందిపుచ్చుకుంటూనే మరో వైపు నుండి వారి భాష అభ్యున్నతికి అన్ని ప్రయత్నాలు చేస్తుంటారు. తమిళ పేర్లు పెడితే చిత్రాలకు సబ్సిడీ ఇస్తుంది ప్రభుత్వం. పిల్లలకు తమిళపేర్లు పెడితే నగదు బహుమతులు ఇచ్చే పథకమూ అమలులో ఉంది. తమిళనాట ఆంగ్లానికి సమాన ఫాయిదాలో తమిళానికి గౌరవం దక్కుతుంది అనటానికి దుకాణాల బోర్డులు, బస్సులమీద ఊళ్లపేర్లే ఒక ఉదాహరణ. సాంకేతిక పదాలకు సమానార్థకాలైన తమిళ పదాలను తయారు చేసి మరీ జనబాహుళ్యంలోకి వాడుక నిమత్తం ప్రతి రోజూ ఆకాశవాణి ద్వారా ప్రసారం చేయిస్తుంది. అక్కడి ప్రభుత్వం, పత్రికలు సాధ్యమైనంత వరకు తమిళ పదజాలాన్నే ఉపయోగిస్తాయ. విద్యాబోధనలో సైతం ప్రాథమిక స్థాయిలో తమిళం నేర్చుకోవడం తప్పని సరి చేసింది ప్రభుత్వం. కన్నడిగులు తమ మాతృభాష మీద అంతే అభిమానం చూపిస్తారు. ప్రాథమిక స్థాయిలో కేవలం మాతృభాషలోనే విద్యా బోధనను చేయాలనే వారి ప్రయత్నం ప్రస్తుతానికి బెడిసికొట్టినా వాస్తవాలను గ్రహించిన న్యాయస్థానాలు ముందు ముందు కన్నడిగులకు ఆ సౌకర్యాన్ని దూరం చేయబోవనే ఆశతో ఉన్నారు. స్వైన్ ఫ్లూ వంటి కొత్త కొత్త పదాలకు కూడా వారు 'హందీ జ్వరం' వంటి అచ్చు కన్నడ వ్యవహారిక పదాలను వాడటానికి చిత్తశుద్ధితో కృషి చేస్తుంటారు. ఐదో తరగతి నుండి మరాఠీని తప్పనిసరి భాష చేయాలని మహారాష్ట్ర ప్రభుత్వం శాసనం తెచ్చుకుంది. శాసన సభలో మరాఠీ వచ్చీరాకపోయినా సరే మాట్లాడితే చాలు ప్రశంశాపూర్వకంగా తోటి శాసన సభ్యులు పార్టీలకతీతంగా బల్లలు చరుస్తుంటారు. భాట్ పూజ దగ్గర నుండీ ప్రతిదీ మహారాష్ట్రలో ఒక భాషా వివాదంగా మారుతున్న వైనం మనం గమనించదగ్గదే. క్యాబ్ డ్రయివర్లకు కూడా మరాఠీ వచ్చి వుండాలని పట్టుబట్టడం లాంటివి మరీ విపరీత భాషా దురభిమానం కిందికి వస్తాయి కానీ... మాతృభాషమీద మమకారం ఉన్నచోటే ఇలాంటి వివాదాలు తలెత్తుతున్నాయన్నంత వరకు మనం అర్థం చేసుకోవచ్చు. మన దగ్గర అది మృగ్యం. మన తెలుగు తల్లి మెడలో మల్లెపూదండ ఎన్నడో వాడిపోయింది. ఆ తల్లికి పట్టే మంగళహారతులు కొండెక్కిపోయే రోజులు కూడా అట్టే దూరంలో లేవు.

మాతృభాషలో చదువుకుంటే మిగిలిన వారికన్నా వెనకబడిపోతామన్న తప్పుడు అభిప్రాయాలను ఏర్పరచుకోవడం మానేయాలి. జపాన్, చైనా, రష్యా, జర్మనీ, ఫ్రాన్సు లాంటి అభివృద్ధి చెందన దేశాల్లోనూ, తమిళ నాడు, కర్ణాటక, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, కేరళ వంటి ముందున్న రాష్ట్రాల్లోనూ ప్రాథమిక విద్యా బోధన మొత్తం మాతృభాషలోనే జరుగుతున్నదని గుర్తించాలి. అరబ్ దేశాల్లో ఇంగ్లీషు కనపడదు. వినపడదు. ఆ దేశాలు స్థానిక వనరులతో అభివృద్ధి చెందలేదా? మాతృభాష ప్రాముఖ్యాన్ని ఆలస్యంగా గ్రహించిన ఇజ్రాయిలు హెబ్రూ భాషను పునరుద్ధరించుకునే ప్రయత్నంలో ఉన్నారు.

ఆంగ్ల భాషను పూర్తిగా విడిచి పెట్టాలని ఎవరూ చెప్పడంలేదు. రష్యను ఆంగ్లాన్ని రష్యన్ భాషలోనూ, చైనీయులు చైనీస్‌లోనూ అభ్యసిస్తున్నట్లే మనమూ ఆంగ్ల భాషను తెలుగు ద్వారా అవగాహన చేసుకునే ప్రయత్నం చేస్తే ఉభయతారకంగా, ప్రయోజనకరంగా కూడా ఉంటుంది. కానీ తెలుగు నాట మనం మన మాతృభాషను కూడా ఆంగ్లంలో నేర్చుకోడానికి ప్రయత్నించడమే అత్యంత దురదృష్టకరం. వాడుకలో లేకపోవడం వల్లే సుసంపన్నమయిన మన భాష వెనుకబడిపోతున్నదని గ్రహించాలి. శాస్త్ర విజ్ఞానం ప్రధానంగా బుద్ధిగ్రాహ్యం కాబట్టి మన పదాలతోనే విషయ గ్రాహకంగా అలవాటు పడితే క్రమంగా ఆ పదాలే జ్ఞాన ద్వారాలు తెరుచుకోడానికి దోహదపడతాయి. ముందు తెలుగులో ఒక మహా నిఘంటువు నిర్మాణానికి 'ఆక్స్‌ఫర్డ్ నిఘంటువు' నిర్మాణం ఫక్కీలో భాషావేత్తలు పూనుకోవాలి. జన బాహుళ్యాన్ని ప్రభావితం చేయగల ప్రసారమాధ్యమాలు మాతృభాషావ్యాప్తికి ఒక ఉద్యమంలాగ ముందుకు తీసుకుని వెళ్లాలి. తెలుగు భాషా పునరుద్ధరణకు పూనుకున్న భాషాభిమాన సంఘాలు తెలుగు విస్తరణ ఒక బాధ్యతగా కాక ఒక హక్కులాగా భావించి అవసరమైన చోట న్యాయపోరాటాలు కూడా చేయవలసిన అవసరం ఉంది.కావాల్సింది కాశీనాథుని నాగేశ్వరరావు గారి వంటి నిబద్ధత, కందుకూరి వీరేశలింగం గారి వంటి పోరాట పటిమ, గిడుగు, గురజాడ వంటి ముందుచూపుతో కూడిన అభిమానం, పట్టుదల. ప్రజల ఆలోచనల్లోని మార్పుని గమనిస్తే ప్రభుత్వాలు వాటంతట అవే నాయకత్వానికి ముందుకు రాక మానవు. మాతృభాషా దినోత్సవం వచ్చింది గనుక సందర్భం కోసం ఏదో సందడి చేయడంతో సంతృప్తి పడకుండా దీర్ఘకాలిక బృహత్తర ప్రణాళికల ద్వారా నిబద్ధత ఉన్న భాషాభిమానులందరూ నడుం బిగించి తెలుగుతల్లి కంట ఒలికే కన్నీరుని తుడిచే కర్తవ్యాన్ని స్వీకరించాలి.

(ఫిబ్రవరి 21 అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం)

★

కవిత్వమ్

ప్రేమంటే...

ప్రేమంటే...
ఆకర్షణల జడిలో తడిసి
ఆలోచనల సంఘర్షణల్లో మెదిలి
అర్థం చేసుకునే దాకా ఎదిగే
రెండు హృదయాల కలయిక

ప్రేమంటే...
ఆనందంలో... ఆవేదనలో... ఆలోచనలో...
బాధలో... భావనలో... వెన్నంటి నిలిచేది

ప్రేమంటే...
నిరాశలో ఉన్నప్పుడు
ఆశల హరివిల్లువై ఆహ్లాద పరిచేది
సమస్యల సుడిగుండాల్లో చిక్కుకున్నప్పుడు
పరిష్కారమార్గమై అరుదెంచేది

ప్రేమంటే...
ఇష్టాయిష్టాలతో ఏకీభవించేది
ప్రేమించినవారి అభిప్రాయాన్ని గౌరవించేది
సఫలమైనా, విఫలమైనా ఎదుటివారి సుఖాన్ని కోరుకునేది

ప్రేమంటే...
మనసు మనసై కలిసిపోయేది
మమతల మధురిమై మైమరిపించేది
అనురాగ తరంగమై హృదయాంతరాన్ని మీటేది

ప్రేమంటే....
నేనున్నానన్న భరోసానిచ్చేది
జీవించేది... జీవితాన్నిచ్చేది
ప్రేమించేది... ప్రేమను పంచేది

-జావెద్





లెక్కలు చెప్తాను వినుకో అక్కా...

లెక్కలు చెపుతాను వినుకో అక్కా
రాజకీయ లెక్కలు చెపుతాను వినుకో చెల్లీ..
పుస్తకాల లెక్కల్లో అక్కో అక్కా
చదువుకొనే పుస్తకాల లెక్కల్లో అక్కో అక్కా
అల్ప కోణముంటుంది, లంబ కోణముంటుంది
అధిక కోణముంటుంది అక్కో అక్కా
కాని రాజకీయ లెక్కల్లో అక్కో అక్కా
అన్ని కుంభకోణాలుంటాయే అక్కో అక్కా

లెక్కలు చెపుతాను॥

ఆదర్శ్ కుంభకోణం అక్కో అక్కా
అవినీతి ఎంతుందో చూడే అక్కా
స్పెక్ట్రమ్ కుంభకోణం చెల్లో చెల్లీ
సర్కారునే కుదిపేసే చెల్లో చెల్లీ
కామన్‌వెల్త్ కుంభకోణం అక్కో అక్కా
అక్రమాలెక్కువే అక్కో అక్కా
ఎమ్మార్ కుంభకోణం చెల్లో చెల్లీ
ఇది పెద్ద గోల్‌మాల్ కుంభకోణం చెల్లో చెల్లీ

లెక్కలు చెపుతాను॥

ఈ అవినీతి లెక్కల్లో అక్కో అక్కా
మనదేశమే ఫస్ట్ వచ్చే అక్కో అక్కా
ఈ అక్రమాల లెక్కల్లో చెల్లో చెల్లీ
మన పాలకులే ఫస్ట్ వచ్చే చెల్లో చెల్లీ

లెక్కలు చెపుతాను॥

ఇవి నేను చెప్పిన లెక్కలు కాదే అక్కా
ఇవి కాకి లెక్కలు కూడా కాదే అక్కా
కాగ్ చెప్పిన లెక్కలే అక్కో అక్కా
మన కాగ్ చెప్పిన లెక్కలే అక్కో అక్కా

లెక్కలు చెపుతాను॥

-సిహెచ్ శంకర్‌రావు

అందుకే నే బతికి వున్నా...

నా చుట్టూ చిమ్మ చీకటి
అడుగేయాలంటే భయం
బితుకుమంటున్న గుండెల్ని
అరచేత్తో చిక్కబట్టుకుని
నేనూ తోడుగా నా నీడ
　　　　దూరంగా అడుగుల చప్పుడు
　　　　ఈ కీకారణ్యంలో క్రూరమృగాలా
　　　　నా పిచ్చి కానీ ఇది కాంక్రీటారణ్యం
　　　　నాకెందుకు వెరపు
కానీ సవ్వడి వినిపిస్తోంది
వస్తోంది క్రూరమృగాళ్లు
నాలుగు దిక్కుల సాక్షిగా
సర్వం అర్పణం
　　　　దిక్కులు పిక్కటిల్లేలా అరచినా
　　　　ప్రయోజనం లేదు
　　　　సాయంరాని కోట్లాదిజనం
　　　　ఏయే పనుల్లో బిజీగా వున్నారో
దిక్కుతోచనియ్యని పిరికితనం
నిర్వేదంగా నవ్వుకుంది
పైకెగసిన పిచ్చి కెరటం
మధ్యలోనే ఫెళ్లుమంది
　　　　ఈపాడు నగరంలో నాలాగే మరెందరో
　　　　పదుగురు చూస్తుండగానే
　　　　వలువల వివస్త్రం
　　　　నలుగురూ వుండేచోటే
　　　　శీలానికి ఫిక్స్‌డ్ రేటు
నిత్యం బలవుతూ... బానిసవుతూ
కన్నపేగునూ, కట్టుకున్న భార్యనూ

విలువియ్యని శోకంతో
భూమాతకు భారంగా
పెరిగిపోతున్న పురుషాహంకారం
　　　　బాధ్యతలేని లోకంలో
　　　　నిశీధిలో... సమాధిలో
　　　　మరెందరిలా బలవ్వాలో

నీకోసం ఓ రోజొస్తుందని
నీవెంటే నడిచొస్తుందని
నీతికోసం, నా జాతికోసం
నిలువనీడ... తోడుకోసం
వెర్రిదాన్నై పిచ్చిదాన్నై
వెక్కిరించే జనుల నడుమ
ఆశగా చూస్తున్నా
రోజులు మారకపోతాయా అని
　　　　నాకు తోడుగా నలుగురొచ్చి
　　　　రక్తమాంసాల రుచిమరిగిన
　　　　రక్కసుల కోరలు తీస్తారని
　　　　కీచకుల పీచమణచాలని
నిన్నటి వ్యక్తినే
నేడు శక్తినై
సమరశంఖం పూరించనా
రుధిరజ్యోత్స్నగ మారనా
రక్తాశ్రువుల నయనాలతో
అసుర రక్తం చిందించనా
　　　　నీరు... నిప్పు ఏకమై నా
　　　　కంటినుండి మింటికెగసే
　　　　మంటలన్నీ ఏకమైతే
　　　　మాడిపోయే శలభమై నువు
　　　　ఈ మట్టిలో కలిసిపో
విర్రవీగిన వికటాట్టహాసం
ఒక్కసారిగా బిగిసిపోతే
వంటినిండా కళ్లు చేసుకు
చూడటానికే నే బతికున్నా

-కె. అరుణ

వంచన

కోడిని పొదిగించి పిల్లలు చేయించి
వాటిని చూసి రోజూ మురిసిపోతూ
వాటి బాసతోనే వాటినాలకించుతూ
ఆకలికి నూకలు, సజ్జలు వేసి పెంచుతూ
రాత్రికి వెచ్చని గూటిలో భద్రంగా వుంచి
కన్న బిడ్డలాగ ఆలనా పాలనా చూస్తూ
ఎంతో ప్రేమగా పెంచి పెద్ద చేసేది
　　　　ఎందుకోసమో?
　　　　ఎందుకోసమంటే...
మీ కుత్తుకలను కట్ చేసి కక్కలుగా తినేందుకు
మేక పిల్లను కొని తెచ్చి పెంచుకుంటూ
అది మే అని అరుస్తుంటే ఆ అని పలుకుతూ
దానికి కావలసిన మేతతో కడుపు నింపుతూ
ఆలనా పాలనా చూసి దాన్ని ఆప్తునిగా పెంచేది
　　　　దేనికోసమో?
　　　　దేనికోసమంటే...
నిన్ను మాంసపు ముక్కలుగా నరికి విక్రయించేందుకు
తన ఆవు కోడె దూడను ఈనిందని మైమరచిపోయి
అది చెంగుచెంగున గెంతుతుంటే, ఎగురుతుంటే
మనసు పరవశించి పచ్చగడ్డి, దాణాలు, కుడితి బెట్టి
పరువంతో అది పెరుగుతుంటే పరవశించిపోయేది
　　　　ఎందుకో?
　　　　ఎందుకంటే...
నీ విత్తులు కొట్టి నీ బ్రతుకు ఛిద్రం చేసి
మెడమీద కాడివేసి వెట్టిచాకిరీ చేయించుకుంటూ
నీ వయసుడిగి జీవిత చరమాంకంలో పని
చేయకపోతే
కటిక వానికమ్మి సొమ్ము చేసుకునేటందుకు
తొలి చూలు ఇంటి పడ్డ కంటుందని విని
పట్టరాని సంతోషంతో దానికి ప్రత్యేక
తిండి, మేత కుడితిలతో కడుపు నింపి
పరవశించి పెంచిపెట్టి పోషించేది
　　　　ఎందుకొరకు?
　　　　ఎందుకొరకంటే...
నీ బిడ్డ నోరు కట్టి కమ్మనైన గుమ్మపాలు
కడవలతో పిండి డైరీలకు అమ్ముకునేందుకు
అంతేగాని మీమీద ప్రేమతో మమకారంతో కాదు
అంతా స్వార్థమే... మానవుని స్వలాభమే
ఐనా మీరు నోరెత్తి హోరెత్తించలేరు
ఇది అన్యాయమని మానవుని కిరాతకమని!

- గాజుల వెంకటేశ్వరరావు

సలలిత రాగ సుధారస మూర్తి సుసర్ల దక్షిణామూర్తి

అయిదున్నర దశాబ్దాల క్రితం 'సంతానం' (1955) చిత్రం కోసం ఘంటసాల పాడిన 'చల్లని వెన్నెలలో చక్కని కన్నె సమీపములో...' పాట ఇప్పటికీ మనసు దోచే మధుర గీతం. అదే చిత్రం ద్వారా లతా మంగేష్కర్ పాడిన తొలి తెలుగు సినీగీతం 'నిదురపోరా తమ్ముడా...' మనసును తడి చేసే మంచి పాట! ఒరియా గాయకుడు రఘునాథ్ పాణిగ్రాహి 'ఇలవేలుపు' (1956) చిత్రం కోసం పాడిన 'చల్లని రాజా ఓ చందమామా...' నేటికీ ఓ మధురానుభూతి. 'నర్తనశాల' (1963) చిత్రంలో మంగళంపల్లి బాలమురళీకృష్ణ పాడిన 'సలలిత రాగ సుధారస సారం...' లాంటి పాటలు తెలుగువారు ఎవరైనా, ఎన్నటికైనా మరిచిపోగలిగేవేనా? మరి, మంగళంపల్లి, లతా మంగేష్కర్, రఘునాథ్ లాంటి అగ్రశ్రేణి కళాకారులను మొట్టమొదటిగా తెలుగు సినిమాల్లోకి తెచ్చి, ఇలాంటి మధుర గీతాలు పాడించిన సంగీత దర్శకుడు ఎవరో ఎందరికి గుర్తున్నారు? 90 ఏళ్ళ వయస్సులో ఆయన ఇవాళ్టికీ మన మధ్యనే ఉన్నారని ఎందరికి తెలుసు? సంప్రదాయ సంగీతాన్ని ప్రాతిపదికగా చేసుకొని, దక్షిణ భారత సినీ సంగీతంలో సినిమాలోని సన్నివేశానికీ, సాహిత్యానికీ కొత్త సొబగులు చేకూర్చిన ఆ సంగీత దర్శకుడు - సుసర్ల దక్షిణామూర్తి.

తొమ్మిది పదుల పండు వయసులో ఆ సంగీతజ్ఞుడు తన ఆఖరి సంతానమైన అనురాధ ఇంట్లో చెన్నపట్నంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. కంటి చూపు పూర్తిగా పోయి, వినికిడి బాగా తగ్గిన ఈ ముదిమి వయస్సులోనూ మనస్సులో మిగిలిన సంగీతాన్ని మర్చిపోలేదు. 1930ల చివరి నుంచి సినీరంగంలో ఉన్న ఆయన ఇవాళ మన మధ్య ఉన్న తెలుగు సినీ సంగీత దర్శకుల్లోకెల్లా సీనియర్! ప్రభుత్వం, సినీ పరిశ్రమ మర్చిపోయినా, సంగీతమే తోడుగా శేషజీవితం గడుపుతున్న సుసర్ల దక్షిణామూర్తిని 'ప్రజాశక్తి' కలిసింది. కుమార్తె అనురాధ సాయంతో ఆయనతో ముఖాముఖీ జరిపింది. సుసర్ల, వారి కుమార్తె చెప్పిన ఆపాత మధుర జ్ఞాపకాలు కొన్ని...

సుసర్ల దక్షిణామూర్తి గారికి ఆయన తాత గారి పేరే పెట్టారు. తాతగారైన సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రి సీనియర్ సాక్షాత్తూ త్యాగరాజ శిష్యపరంపరకు చెందినవారు. కర్ణాటక సంగీత త్రిమూర్తుల్లో ఒకరైన త్యాగరాజు గారి శిష్యులు ఆకుమళ్ళ (మనంబుచావడి) వెంకట సుబ్బయ్య వద్ద దక్షిణామూర్తి సీనియర్ శాస్త్రీయ సంగీతం అధ్యయనం చేశారు. ఆ అధ్యయనం తరువాత తిరిగి స్వగ్రామం పెదకళ్ళేపల్లికి వచ్చిన దక్షిణామూర్తి సీనియర్ ఎంతో మందికి ఇంట్లోనే భోజనాది వసతులు కల్పించి మరీ, కర్ణాటక సంగీతంలో శిక్షణనిచ్చారు. ఆయన దగ్గర శిక్షణ పొందిన ప్రసిద్ధుల్లో పారుపల్లి రామకృష్ణయ్య పంతులు, (అంధుడైనప్పటికీ, సంగీతం నేర్చుకొని గొప్పవాడైన) సింహాద్రి అప్పలాచార్యులు, రాజనాల వెంకటప్పయ్య, పిచ్చి హరి, వంకమామిడి వీరరాఘవయ్య తదితరులు ఉన్నారు.

సుసర్ల దక్షిణామూర్తి సీనియర్ నుంచి ఆయన కుమారుడు సుసర్ల కృష్ణబ్రహ్మశాస్త్రికీ, అనంతరం ఆయన నుంచి ఆయన కుమారుడైన సుసర్ల దక్షిణామూర్తి జూనియర్‌కూ శాస్త్రీయ సంగీతం వాహినిగా ప్రవహించింది. 11 నవంబర్ 1921 నాడు కృష్ణాజిల్లా దివిసీమలో దక్షిణ కాశీగా ప్రసిద్ధికెక్కిన పెదకళ్ళేపల్లి గ్రామంలో సుసర్ల దక్షిణామూర్తి జూనియర్ జన్మించారు. తల్లి పేరు - అన్నపూర్ణ. దక్షిణామూర్తి జూనియర్ తన తండ్రి కృష్ణబ్రహ్మ శాస్త్రి వద్దే ఆరో ఏట నుంచి సంగీతం అభ్యసించారు. ఒకపక్క గాత్ర సంగీతంతో పాటు, మరోపక్క వయొలిన్ కూడా నేర్చుకున్నారు. మొదట గాత్రంలో, ఆ తరువాత వయొలిన్‌లో దిట్టగా తయారయ్యారు. దక్షిణామూర్తి జూనియర్ బడి చదువులు పెద్దగా చదివింది లేదు. "ఏ ఆరో తరగతి వరకో, ఏడో తరగతి వరకో చదువుకున్నా. అంతే! హిందీ భాష రాయడం, చదవడం, మాట్లాడడం తెలుసు" అని ఆయన చెప్పారు. ఇటు వయొలిన్‌తో, అటు గాత్రంతో జంత్ర - గాత్ర కచ్చేరీలు చేస్తూ, 13 ఏళ్ళ ప్రాయంలోనే ఎన్నో రాజాస్థానాల్లో ఆయన సంగీత కచ్చేరీలు చేశారు. చల్లపల్లి రాజా గారి దగ్గర, ఏలూరులో, విజయవాడలో - ఇలా చాలా చోట్ల వయొలిన్‌తో కచ్చేరీలు చేశారు. 16వ ఏటనే 'గజారోహణ' గౌరవం అందుకున్నారు. "విజయవాడలో నా గాత్రం విని ప్రముఖ పండితులు తిరుపతి వేంకట కవులు సంతోషించారు. నా మీద ఏకంగా పద్యమే చెప్పారు" అని సుసర్ల తెలిపారు.

"మా అమ్మ, నాన్న గారు తెనాలిలో చాలా కాలం కాపురం ఉన్నారు. అక్కడే నేనూ ఉండేవాణ్ణి. ప్రఖ్యాత నటి కాంచనమాలదీ తెనాలే! సంగీతంలో నా విద్వత్తును గుర్తించిన ఆమె, ప్రముఖ సినీ సంగీత దర్శకుడు భీమవరపు నరసింహారావు లాంటి సినిమావాళ్ళతో చెబితే, వాళ్ళు వచ్చి నా కచ్చేరీ చూశారు. తెనాలిలో నేను చేసిన కచ్చేరీ చూసిన భీమవరపు నరసింహారావు, 'మద్రాసుకు వస్తావా?' అని అడిగారు. వారి పిలుపు మేరకు నేను మద్రాసు చేరాను. రాజనాల వెంకటప్పయ్య వెంట ఉండి నన్ను మద్రాసుకు తీసుకువెళ్ళారు" అని దాదాపు 17వ ఏట నుంచి స్వతంత్రంగా బతికిన సుసర్ల తన సినీ జీవిత ఆరంభాన్ని చెప్పుకొచ్చారు. భీమవరపు నరసింహారావు వద్ద చేరి, 1937 నుంచి సహాయకునిగా పనిచేశారు. భీమవరపు సంగీతం అందించిన నవ్యకళా ఫిలిమ్స్ వారి 'మీరాబాయి' (1940) చిత్రానికి పనిచేశారు. దక్షిణామూర్తికి అదే తొలి సినీ అనుభవం. ఆ తరువాత "ఎన్నో సినిమాలకు సంగీత శాఖలో పనిచేస్తూ, వయొలిన్ వాయించాను. నేపథ్య గానం కూడా చేశాను" అని సుసర్ల తెలిపారు.

1938లో 'హిజ్ మాస్టర్స్ వాయిస్' (హెచ్.ఎం.వి) సంస్థలో హార్మోనిస్టుగా చేరారు. "తరువాతి రోజుల్లో సంగీత దర్శకులుగా ప్రసిద్ధులైన జంట ఎం.ఎస్. విశ్వనాథన్ - రామ్మూర్తిలో ఒకరైన రామ్మూర్తి నాకు సహోద్యోగి. నేను, రామ్మూర్తి హెచ్.ఎం.వి.లో వాద్యకళాకారులుగా పనిచేశాం" అని సుసర్ల చెప్పారు. 1939 ప్రాంతంలో 'ఆకాశవాణి' (ఏ.ఐ.ఆర్) - ఢిల్లీలో ప్రవేశించారు. "ఆకాశవాణిలో నేను 'ఏ' గ్రేడ్ ఆర్టిస్టును. మద్రాసు, కలకత్తా, బెల్గామ్, పూనా, బొంబాయి, కటక్ లాంటి ఎన్నో చోట్ల ఆకాశవాణిలో పనిచేశాను. మద్రాసులో దాదాపు ఓ ఏడాది పాటు పనిచేశాను. నా పనితీరుకు మెచ్చి, ఢిల్లీకి వెళ్ళమని మద్రాసు ఆకాశవాణి కేంద్రం డైరెక్టరే నన్ను ఢిల్లీకి పంపించారు" అని ఆయన తెలిపారు. దక్షిణ భారత భాషల సంగీత నిర్దేశకుడిగా సుసర్ల ఎన్నో మధుర స్వరాలను ఆకాశవాణి శ్రోతలకు అందించారు. జాతీయ వార్త సంస్థ 'సెంట్రల్ న్యూస్ ఆర్గనైజేషన్'లో సంగీత నిర్దేశకుడిగా సేవలందించారు.

పర్లాకిమిడి రాజా గజపతిదేవ్ తీసిన 'నారద నారది' (1946) చిత్రంతో సుసర్ల దక్షిణామూర్తి తొలిసారిగా సంగీత దర్శకత్వం చేపట్టారు. తరువాతి కాలంలో ప్రముఖ నటిగా పేరు తెచ్చుకున్న సూర్యకాంతం తొలి చిత్రమైన ఈ సినిమాకు ఆయన సంగీత సారథ్యం వహించడమే కాకుండా, చిన్న పాత్ర కూడా ధరించారు. ఆ తరువాత కొల్హాపూర్‌లో నిర్మించిన 'సేతు బంధన్' (1946) చిత్రానికీ, పూనాలో నిర్మించిన 'భట్టి విక్రమార్క' చిత్రానికీ సంగీత దర్శకత్వం వహించారు.

వయొలినిస్టుగా అనేక చిత్రాల్లో పనిచేస్తూ వచ్చారు. ప్రముఖ సినీ సంగీత దర్శకుడు సి.ఆర్. సుబ్బురామన్ దగ్గర సహాయకుడిగా పలు చిత్రాలకు పనిచేశారు. "ఆయన దగ్గర కలకత్తాలో ఓ చిత్రానికి సంగీతం చేశాం" అని సుసర్ల చెప్పారు. 'చెంచులక్ష్మి' (1943), 'రత్నమాల' (1948 జనవరి2 విడుదల), 'స్వప్నసుందరి' (1950), అక్కినేని 'దేవదాసు' (1953) తదితర చిత్రాలకు కూడా ఆయన పనిచేశారు. "నాన్నగారు వయొలినే కాకుండా హార్మోనియం, అరుదుగా వేణువు కూడా వాయించేవారు" అని అనురాధ చెప్పుకొచ్చారు.

'సంసారం' (1950) చిత్రంతో సంగీత దర్శకుడిగా సుసర్ల దక్షిణామూర్తి బాగా ప్రాచుర్యం పొందారు. ఆ రోజుల్లోనే "ప్రముఖ నటి - నిర్మాత లక్ష్మీరాజ్యం నిర్మించిన రెండు, మూడు సినిమాలకు కలకత్తాలో పనిచేశాను" అని ఆయన చెప్పారు. ఆకాశవాణిలో పనిచేయడం కూడా సంగీత దర్శకుడయ్యాక సుసర్లకు బాగా ఉపయోగపడింది. "గాయని లతా మంగేష్కర్ అప్పట్లో ఢిల్లీ రేడియో స్టేషన్‌లో పాటలు పాడుతుండేది. ఆమె గాత్రంతో, ఆమెతో పరిచయం ఉండడంతో, నేను సినిమా సంగీత దర్శకుడినైన తరువాత ఆమెను పిలిపించాను. ఆమెతో తొలిసారిగా తెలుగు సినిమాలో పాట పాడించాను. 'నిదురపోరా తమ్ముడా...' అనే ఆ అనిసెట్టి సుబ్బారావు రచన ఎంతగా ప్రాచుర్యం పొందిందో అందరికీ తెలిసిందే!" అని ప్రఖ్యాత గాయని లతాజీతో తన పరిచయాన్ని సుసర్ల వివరించారు.

మంగళంపల్లి బాలమురళీకృష్ణతో...

తొలి రోజుల్లో 'సంసారం' (1950)తో నిలదొక్కుకున్న సుసర్ల ఆ తరువాత సంగీతం అందించిన చిత్రాల్లో ముఖ్యమైనవి కొన్ని - 'ఆలీబాబా - నలభై దొంగలు', 'సర్వాధికారి' (1951), 'ఆడజన్మ' (1951), 'దాసి' (1952), 'సంతానం' (1955), 'ఇలవేలుపు' (1956), 'హరిశ్చంద్ర' (1956), 'భలే బావ' (1957), 'శ్రీకృష్ణలీలలు' (1959), 'అన్నపూర్ణ' (1960), 'నర్తనశాల' (1963), 'శ్రీమద్విరాటపర్వం' (1979), 'శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర' (1984) మొదలైనవి. నిండైన గాత్రం ఉన్న దక్షిణామూర్తి తొలి రోజుల్లో సినీ నేపథ్య గాయకుడిగా పలు పాటలు పాడారు. 'పరమానందయ్య శిష్యులు' (1950), 'శ్రీలక్ష్మమ్మ కథ' (1950), 'స్త్రీ సాహసం' (1951) మొదలైన చిత్రాలలో ప్రముఖ హీరో అక్కినేని నాగేశ్వరరావుకు ప్లే-బ్యాక్ పాడారు. 'సర్వాధికారి' (1951) చిత్రంలో తమిళ హీరో ఎం.జి.ఆర్.కు గొంతు అరువిచ్చారు.

అలా సినీ జీవితపు తొలి రోజుల్లో కొన్ని చిత్రాల్లో ప్లే-బ్యాక్ కూడా పాడిన సుసర్లకు అప్పట్లో నటన మీద కూడా కొంత ఆసక్తి ఉండేది. "నటన మీద మీకు ఆసక్తి ఉండేదా?' అని అడిగితే 'ఏం చెప్పను! 'నారద నారది'లో చిన్నవేషం, రాజ్యం పిక్చర్స్ 'హరిశ్చంద్ర' చిత్రంలో కాశీ రాజు వేషం వేశాను" అంటూ ఆయన నవ్వేశారు.

అన్ని భాషల్లోనూ కలిపి 135 దాకా చిత్రాలకు సుసర్ల దక్షిణామూర్తి పని చేశారు. సంగీత దర్శకులు ఎస్.పి. కోదండపాణి, ఎ.ఎ. రాజ్, శ్యామ్ మొదలైనవారు ఈయన వద్ద పనిచేసినవాళ్ళే! అలాగే, ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎస్. విశ్వనాథన్ సైతం సుసర్ల వద్ద హార్మోనిస్టుగా పనిచేశారు. సంగీత దర్శకుడిగా సుసర్ల ప్రధానంగా హార్మోనియమ్ మీదే బాణీలు కట్టేవారు. జమునా రాణి, పి. లీల, బెంగుళూరు లత మొదలైన గాయనీమణులకు తొలి అవకాశం ఇచ్చి, పరిచయం చేసింది - సుసర్లే! 'సంతానం' (1955)తో లతా మంగేష్కర్‌నూ, 'ఇలవేలుపు' (1956)తో రఘునాథ్ పాణిగ్రాహినీ, 'వచ్చిన కోడలు నచ్చింది' (1959)తో ఎం.ఎల్. వసంత కుమారినీ, 'నర్తనశాల' (1963)తో మంగళంపల్లి బాలమురళీకృష్ణనూ సుసర్ల దక్షిణామూర్తి తెలుగు చిత్ర రంగానికి పరిచయం చేశారు. సుసర్ల స్వరపరచగా, రావు బాలసరస్వతి గానం చేసిన 'నీలవణ్ణ కణ్ణా వాడా నీ వరు ముత్తం తాడా...' (శివాజీ గణేశన్, పద్మిని నటించిన ఓ తమిళ చిత్రంలోని పాట) లాంటి తమిళ చిత్ర గీతాలు సైతం ఇవాళ్టికీ అక్కడ పాపులరే!

ఆంధ్ర రాష్ట్ర అవతరణ సందర్భంగా ప్రార్థనా గీతం పాడి జవహర్‌లాల్ నెహ్రూ చేతులమీదగా సన్మానం అందుకున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన గుర్తింపు తక్కువైనప్పటికీ, వివిధ ప్రైవేటు సాంస్కృతిక, కళా సంస్థలు ఎన్నో సన్మానాలు, సత్కారాలు చేశాయి. బిరుదులు ప్రదానం చేశాయి. 'స్వరశిల్పి', 'సంగీత కళాప్రపూర్ణ', 'సుస్వరాల సుసర్ల', 'స్వరబ్రహ్మ', 'సంగీత కళానిధి', 'సంగీత సమ్రాట్', ఎన్టీఆర్ పేర్కొన్న 'స్వర సుధానిధి' లాంటి బిరుదులు సుసర్లకు దక్కాయి. విదేశాలలో కూడా కచ్చేరీలు చేసి, తమ సంగీత వైభవాన్ని సుసర్ల చాటుకున్నారు.

కుటుంబ జీవితం సంగతికి వస్తే - దక్షిణామూర్తికి చిన్న వయస్సులోనే పెళ్ళయింది. "మా అమ్మ, నాన్న గార్ల పెళ్ళి చాలా గమ్మత్తుగా జరిగింది. మా నాన్న గారు నంద్యాలలో కచ్చేరీ చేయడానికి వెళ్ళినప్పుడు, అక్కడ ఆయనకు భోజనాది వసతులు చూడడం కోసం చిన్న పిల్ల అయిన మా అమ్మ గారిని అక్కడి పెద్దలు నియోగించారట. పద్మశాలీ కుటుంబానికి చెందిన మా అమ్మ గారి ఒద్దిక, ఓర్పు చూసి, మా నాన్నగారు ఇష్టపడ్డారు. చివరకు పూరీలోని జగన్నాథ స్వామి గుడిలో వారిద్దరూ పెళ్ళి చేసుకున్నారు. అప్పటికి మా నాన్న గారి వయస్సు 17 ఏళ్ళు, మా అమ్మ గారి వయస్సు 15 ఏళ్ళు" అని ఆ సంగతులను అనురాధ వివరించారు.

అయితే, కొన్నేళ్ళ తరువాత సుసర్ల జీవితం హాయిగా ఏమీ సాగిపోలేదు. ఆరోగ్యం ఆయనను కుంగదీసింది. మధుమేహ వ్యాధి అధికమైంది. దాంతో, ఆయన రెండు కళ్ళకూ రెటీనా డిటాచ్‌మెంట్ వచ్చింది. 1960లలో మొదట ఆయన ఎడమ కన్ను దెబ్బతింది. అలాంటి పరిస్థితుల్లో కూడా ఆయన ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. ఉన్న ఒంటి కన్ను చూపుతోనే కష్టపడి సంగీతం చేస్తూ వచ్చారు. సంగీత దర్శకుడిగా అవకాశాలు తగ్గాక, కుటుంబ పోషణ కోసం అప్పటి ప్రముఖ సంగీత దర్శకుడు చక్రవర్తి దగ్గర పాటల రికార్డింగుల్లో వయొలిన్ వాద్య కళాకారుడిగా కూడా పనిచేశారు. 1982 నుంచి 1987 వరకు ఆయన చక్రవర్తి సంగీత బృందంలో వయొలిన్ వాయించారు. కానీ, ఆ తరువాత 1987 ప్రాంతంలో సుసర్లకు రెండో కన్ను కూడా దెబ్బతింది. దాంతో దాదాపుగా అంధత్వం ఆవరించింది. అయినా, ఆయన ఇప్పటికీ మనోనేత్రంతో సంగీత లోకాలను దర్శించడం మానలేదు. వయస్సు 90 ఏళ్ళు నిండుతున్నా, ఇవాళ్టికీ కాస్తంత హుషారుగా అనిపిస్తే, ప్రతిభావంతురాలైన భరతనాట్య కళాకారిణి అయిన మనుమరాలు శుభాంజలీ సద్గురుదాస్ లాంటి వారు చేతికి వయొలిన్ అందించగానే అలవోకగా పాట పాడుతూ, తీగలపై సుస్వర విన్యాసం సాగిస్తారు.

గణనీయమైన సంఖ్యలో ఎన్.టి.రామారావు చిత్రాలకు సంగీతం అందించిన సుసర్ల, "ఎన్టీఆర్ నన్ను బాగా చూసుకున్నారు. ఆయన చిత్రాల్లో పనిచేసేందుకు నాకు పదే పదే అవకాశమిచ్చారు" అని చెప్పారు. "శాస్త్రీయ సంగీత ప్రధానమైన బాణీలు కట్టాలంటే - అప్పట్లో సాలూరి రాజేశ్వరరావు గారు, నాన్న గారినే ఎక్కువగా అడిగేవారు. అలాంటి చిత్రాలకు నాన్నగారిని ఎన్టీఆర్ ప్రత్యేకంగా పిలిపించి పెట్టుకొనేవారు. ఎన్టీఆర్ రూపొందించిన 'శ్రీమద్విరాటపర్వం', 'శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర' చిత్రాలకు పనిచేసే నాటికే నాన్నగారికి సరిగ్గా కళ్ళు కనిపించేవి కావు. ఎవరో ఒకరు వచ్చి, నాన్నగారిని రికార్డింగులకు తీసుకువెళ్ళేవారు. ఆ పరిస్థితుల్లో కూడా ఆయన హార్మోనియమ్ ముందు కూర్చొని, బాణీలు కట్టి, గాయకులతో పాడించేవారు" అని ప్రస్తుతం దగ్గరుండి మరీ సుసర్ల దక్షిణామూర్తి ఆలనా పాలనా చూసుకుంటున్న ఆయన ఆఖరి సంతానం అనురాధ వివరించారు.

చాలామందికి తెలియని విషయం ఏమిటంటే - సుసర్ల దక్షిణామూర్తి కొన్ని చిత్రాలను నిర్మించారు కూడా! "నా పేరు మీద 'అనురాధా మూవీస్' అనే సంస్థను నెలకొల్పి, రెండు సినిమాలు కూడా తీశారు. అవి - 'మోహినీ రుక్మాంగద', 'రమా సుందరి' అని నాకు గుర్తు. అయితే, తెలియని వ్యవహారం కావడంతో చిత్ర నిర్మాణం వల్ల చాలా నష్టపోయారు" అని అనురాధ చెప్పుకొచ్చారు.

తొంభై ఏళ్ళ వయసులో, కంటి చూపు లేక పూర్తిగా ఇంటికే పరిమితమైనా, ఇప్పటికీ సుసర్ల దక్షిణామూర్తికి సంగీతమే మానసికంగా ఆసరా. ఈ వయసులో ఆయన ఒంటరిగా కూర్చొని, తనలో తానే ఏవో పాటలు, కీర్తనలు పాడుకుంటూ ఉంటారు. బహుశా ఆ సలలిత రాగ సుధారస సారమే అనేక ఆర్థిక, మానసిక ఇబ్బందుల్లో మధ్య కూడా ఈ వయస్సులోనూ ఆయనను ముందుకు నడిపిస్తోంది. తెలుగు సినీ రంగంలో ప్రస్తుతం ఉన్న అత్యంత సీనియర్ సంగీత దర్శకుడైన ఈ సంగీత మూర్తికి ప్రభుత్వం, కళాప్రియులు కూడా అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- రెంటాల జూనియర్

నవ్వుల్ - పువ్వుల్

చివరి కోరిక

(ఓ ఖైదీని కరెంటు కుర్చీలో కూర్చోబెట్టారు జైలు అధికారులు. కరెంటు పంపడమే తరువాయి అతని ప్రాణాలు పోతాయి)

జైలు అధికారి: నీ చివరి కోరిక ఏదైనా వుంటే చెప్పవయ్యా!

ఖైదీ: ఆఖరి క్షణంలో నీ చెయ్యి పట్టుకోవాలనుంది.

ఊహాగానాలు



(ఇద్దరు దొంగలు హోటల్లో దొంగతనం చేస్తుంటారు)

1వ దొంగ: నాకు పోలీస్ సైరన్ వినబడింది. దూకేద్దాం త్వరగా.

2వ దొంగ: ఏం తమాషానా! మనం 13వ అంతస్తులో వున్నాం.

1వ దొంగ: ఊహాగానాలకిది సమయం కాదు.

చదవలేదు

వ్యక్తి: నా కుక్క తప్పిపోయిందండీ.

పోలీస్ ఇన్‌స్పెక్టర్: పేపర్లో ప్రకటన ఎందుకు ఇవ్వకూడదు?

వ్యక్తి: మరీ తెలివితక్కువగా చెప్పకండి సార్. కుక్కకు చదువు రాదు.

కాంటాక్టు

పోలీస్: ఏమ్మా! నీ లైసెన్స్‌లో కళ్లజోడు పెట్టుకోవాలని రాసుంది కదా. మరి ఏదీ!

మహిళ: నాకు కాంటాక్టులు వున్నాయండీ.

పోలీస్: నీకు ఎవ్వరు తెలిసినా నేను పట్టించుకోను. నీకు చలానా రాస్తున్నాను.

పాపం అమ్మ!

ఆంటీ: పాపా! మీ కొత్త ఇల్లు నచ్చిందా?

పాప: బాగా నచ్చిందాంటీ.

ఆంటీ: ఏం నచ్చిందేంటి?

పాప: నాకోసం ఓ గది. అన్నయ్య కోసం ఓగది. అక్కయ్య కోసం ఓగది. అంతా బావుంది. కానీ ఒక్కటే బాలేదు.

ఆంటీ: ఏంటమ్మా...

పాప: పాపం అమ్మకే గదిలేదు. నాన్న గదిలోనే వుంటోంది.

చంద్రుడు-రాజకీయ నాయకులు

ఒక రాజకీయ నాయకుడు చంద్రుడిమీద వుంటే ఏమౌతుంది!

సమస్య

10 మంది రాజకీయ నాయకులు చంద్రుడిమీద వుంటే ఏమౌతుంది?

సమస్య

100 మంది రాజకీయ నాయకులు చంద్రుడిమీద వుంటే ఏమౌతుంది?

సమస్య

అందరు రాజకీయ నాయకులు చంద్రుడిమీదే వుంటే ఏమౌతుంది?

సమస్య పరిష్కారమౌతుంది.

లక్ష్యం

(ఓ వ్యక్తి బుక్‌షాపుకెళ్తాడు)

వ్యక్తి: మేడమ్! స్వయం సహాయక విభాగం ఎక్కడ వుందండీ!

మేడమ్: అది చెప్పేస్తే దాని లక్ష్యమే నెరవేరదు సార్.

సాయం

టీచర్: నీ హోంవర్క్ చెయ్యడంలో మీ నాన్నగారు సాయం చేస్తారా?

విద్యార్థి: లేదండీ, మొత్తం తనంతట తనే చేస్తారండీ.

అమెరికా

ఒకడు: ఏంట్రా! తర్వాత ఏం చేద్దామనుకుంటున్నావ్? నీ ప్రయాణం అమెరికాకా? చంద్రుడిమీదకా?

రెండవవాడు: అమెరికాకేరా!

ఒకడు: ఏం ఎందుకని?

రెండవవాడు: చంద్రుణ్ణి రోజూ చూస్తాం. అమెరికా అలా కాదు కదా.

బాగా నచ్చినది

రచయిత: నా నవల నచ్చిందా సార్?

ప్రచురణకర్త: నిజంగా నాకు ఓ పదం భలేగా నచ్చింది.

రచయిత: (చాలా ఉత్సాహంగా...) ఏంటది?

ప్రచురణకర్త: అయిపోయింది.

జోక్స్ బాగా వేస్తారా? మరైతే ఆలస్యం ఎందుకు! కార్డు మీద రాసి పంపండి. పాఠకులను కడుపుబ్బ నవ్వించండి. మా చిరునామా: స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ప్లాట్‌నెం.21/1, ఆజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్

కొత్త పుస్తకాలు

చారిత్రక నవల

తాను ప్రత్యక్షంగా చూసిన నిజాం పాలనను, భూస్వాముల పెత్తందారీతనాన్ని, అదే భూస్వాముల కుటుంబాల్లో ఆవిర్భవించిన ఉద్యమకారులను, లోకం పోకడ తెలియని సామాన్యులు సైతం చైతన్యం పొంది ఉద్యమంతో మమేకం కావడం...వంటి పరిణామాలను 'గంగు' నవల ద్వారా ఆవిష్కరించారు వట్టికోట ఆళ్వారుస్వామి. నవలకు 'గంగు' అని పేరు పెట్టినా నవలలో ఈ పాత్ర పెద్దగా కనబడదు. గంగు (గంగమ్మ) నాగభూషణం అనే ఓ సామన్యుడి కూతురు. బంగారం వస్తువుల పని చేసుకుంటూ గడిపే నాగభూషణం ఆ ఊరి దొర జగ్గయ్యకు నమ్మిన బంటు. అయితే ఆ దొర నాగభూషణం భార్య అంతమ్మ పై కన్ను వేయడం, దొరతో విభేదాలు రావడం, ఊరు వదిలి వెళ్లిపోవడం, అమాయకుడైన నాగభూషణం క్రమంగా ప్రజా ఉద్యమాల్లో మమేకమై జైలుకు వెళ్లడం నవలలో ఆసక్తికరమైన పరిణామాలు. నవలలో ప్రధానమైన పాత్రలు రెండు. ఒకటి లాయరు కుమారుడైన నవనీతం. రెండు రాక్షసుడైన మైరావణుడి మాదిరిగా వ్యవహరిస్తూ ఊరి ప్రజలను చెండుకుతినే వెంకట్రావు అనే భూస్వామి కూతురు సుజాత. వీరిద్దరూ విద్యావంతులు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలను, అక్రమాలను ఎదిరించి పోరాడతారు. పోలీసు జులుం చవిచూస్తారు. ఎర్ర జెండా నీడలో ప్రజా ఉద్యమాలకు అంకితమవుతారు. కూతురు సుజాత పేరు పొందిన ఉద్యమ నాయకురాలై ప్రజల నీరాజనాలు అందుకుంటుంటే, తన దొరతనం ఎందుకూ కొరగానిదిగా మారిపోతుంటే వెంకట్రావులో ఒక విధమైన ఘర్షణ మొదలవుతుంది. చివరకు మతిస్థిమితం కోల్పోయి 'కామ్రేడ్ సుజాత జిందాబాద్' అని కేకలు పెడుతుండగా నవల ముగుస్తుంది. ఈ నవలలో అటు నిజాం ప్రభుత్వానికి ఊడిగం చేస్తూ ప్రజలను పీడించే దొరలు, పోలీసు ఇన్‌స్పెక్టర్లు, వారి నమ్మిన బంట్లు మొదలైన పాత్రలు ఓ పక్క కనబడతాయి. మరోపక్క ఉద్యమకారులు, ప్రజల్లో చైతన్యం నింపేవారు, దొరల అకృత్యాలకు బలైన ఆడపాపలు (దాసీలు), దగా పడినవారు, దోపిడీకి గురైనవారు కనబడతారు. ఈ నవలలో ప్రపంచ యుద్ధం, అంతర్జాతీయ రాజకీయాలు, ఆంధ్రమహా సభ, స్టేట్ కాంగ్రెసు రాజకీయాలు, కమ్యూనిస్టుల పోరాటం...మొదలైన అంశాలు ప్రస్తావనకు వస్తాయి. గంగు కూడా ఉద్యమంలో ఒక పాత్రే. అణచివేతకు గురైన ప్రజలు ఎలా తిరగబడతారో ఈ నవల స్పష్టంగా కళ్లకు కట్టింది. ముఖ్యంగా నిజాం నాటి నిజాలను మన కళ్ల ముందు ఉంచింది. నవలలోని పాత్రల మధ్య సంభాషణలు తెలంగాణ మాండలికంలో సాగినా ఏ ప్రాంతం పాఠకుడికైనా ఇబ్బందిగా ఉండదు. ప్రతి పేజీ అడుగు భాగంలో ఆ పదాలకు అర్థాలు ఇచ్చారు రచయిత. అలాగే ఉర్దూ పదాలకు కూడా అర్థాలు ఇచ్చారు. ఈ ఉద్యమ నవలను ప్రచురణకర్తలు ఈ తరం పాఠకులకు మళ్లీ అందివ్వడం ముదావహం.

గంగు (నవల), వట్టికోట ఆళ్వారుస్వామి, పేజీలు: 206, వెల: రూ.90, ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

-ఎం. నాగేందర్

కవితామృతాభిషేకం



'**నా** తెలంగాణా కోటి రతనాల వీణ' అని కవిత్వంలో అగ్నిధారలు కురిపించి, నైజాము కరకు పాలన నుండి విముక్తమై మహోంద్రోదయం అభిలషించిన కవి దాశరథి. పద్యాన్ని, పాటనీ, వచనాన్నీ, కవిత్వమయం చేసిన సమర్థుడు. లౌక్యాలు, కల్లాకపటాలు తెలియని వాడు. పీడిత ప్రజావాణికి మైకుగా కంఠమెత్తినవాడు. అతని కవిత్వంలో రుద్రవీణలు మోగాయి. అమృతాభిషేకాలూ జరిగాయి. చైతన్య స్ఫూర్తిని, అభ్యుదయ భావాలనూ పునర్నవీకరించుకుంటూ కవితాపుష్పకము నెక్కి ప్రయాణించిన వాడు దాశరథి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చివరి ఆస్థానకవి ఆయనే. కానీ తెలుగు కవిత్వప్రేమికుల గుండెల్లో చిరస్థానం ఆయనదే. దాశరథి సాహిత్యమంతా అయిదు సంపుటాలుగా ఈ తరానికి అందించాలన్న మంచి కృషిలో భాగంగా విశాలాంధ్రవారు డా॥ దాశరథి కృష్ణమాచార్య గారి 'కవిత' ను ఒక సంపుటిగా తెచ్చారు. ఈ సంపుటిలో1949నాటి 'అగ్నిధార', 1950 నాటి 'అమృతాభిషేకం', 1966 నాటి 'కవితాపుష్పకం' కవిత్వమంతా ఒకచోట కూర్చారు. 'తిమిరంతో సమరం' వంటివి తదుపరి సంపుటాలలో వస్తాయి. అలాగే 'గాలిబ్ గీతాలు' వంటి అనువాదాలు కూడాను. దాశరథి సాహిత్యం -1 కవితగా వచ్చిన ఈ సంపుటి అలనాటి తెలంగాణా స్థితిగతులను, నిజాం నిరంకుశ పాలనపై నిరసనను, తెలుగువారంతా ఒక్కటై మహోంద్రోదయం కలగాలన్న ఆకాంక్షలను బలంగా కవిత్వీకరించిన దాశరథి కలం బలానికి గొప్ప దాఖలా. ఆ తర్వాత 'అమృతాభిషేకం'లో 'కవితాపుష్పకం'లో దాశరథి కలంలో ఒక వంక హృద్యమైన పద్యం, మరోవంక లయగతుల గేయం, ఇంకోవంక వచన కవిత్వం ప్రక్రియ ఏదయినా ఎంత క్రియాత్మకంగా వెలయించిందీ స్పష్టమవుతుంది. "నాదొక వెర్రి, త్రాగుడున/నాడును వీడును అమ్ముకున్న ఉ/న్మాదివలెన్ కవిత్వమున/నా సకలమ్మును కోలుపోయి రా/త్రీ దివముల్ రచించితిని/తీయని కావ్య రసప్రపంచముల్/వేదన యేదియో కలత/వెట్టును గుండియనెందుచేతనో" అని తన 'మహాలేఖిని' గురించి 'అగ్నిధార'లోనే ప్రస్తావించాడు కవి. తన ప్రస్థానంలో 'కవితా పుష్పకం' అధిరోహించాక కూడా...."పాత సంప్రదాయపు గోడలు/పడద్రోసెద వెలుతురు కోసం/తరుణత్వం మెచ్చకపోతే/తిరగబడెద దేవుని మీద" అన్న స్ఫూర్తిని నిలుపుకునే సాగాడు. దాశరథి నిలబడే కవిత్వం. తెలుగుజాతి పునర్నవం తాను. దాశరథి కవిత్వ అమృతాభిషేకంలో ఈ తరమూ పునీతమయ్యేందుకు అందుకోదగిన చషకం ఈ సంపుటి.

ప్రజాకవి దాశరథి సాహిత్యం -1 (కవిత), దాశరథి కృష్ణమాచార్య, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజ్ఞాన భవన్ 4-1-435, బ్యాంక్‌స్ట్రీట్, హైదరాబాద్, వెల : 190/-.

- సుధామ

విప్లవ సందేశం
ప్రిన్స్ క్రొపాట్కిన్
వెల : 20/-, పేజీలు : 44
ప్రతులకు :
ప్రజాశక్తి బుక్‌హౌస్
1-1-187/1/2,
చిక్కడపల్లి, హైదరాబాద్- 20
మరియు అన్ని బ్రాంచీలు.

Fixing Global Finance
Kaviljit singh
price :100/-, pages :127
For copies
Prajasakthi book House
MH Bhavan, plot no 21/1,
Azamabad.
near RTC Kalyana Mandapam,
HYD.



చూద్దామా



కంపూచియాలో హిందూ దేవాలయం ఆంగ్‌కోర్ వాట్

అది మన దేశమూ కాదు. అక్కడ కనిపించే సంస్కృతీ సంప్రదాయాలు, పురాణాలు, ఇతిహాసాలు, దేవాలయాలు అక్కడ ప్రజలవీ కాదు. కానీ ఆ దేవాలయాన్ని చూస్తే మనం భారతదేశంలో ఉన్నామా అనిపిస్తుంది. ఆ దేశం కంపూచియా (కంబోడియా) అయితే... ఆ ఆలయం ఆంగ్‌కోర్ వాట్. ప్రపంచంలోనే అతి పెద్ద హిందూ దేవాలయంగా పేరుగాంచిన ఆంగ్‌కోర్ వాట్ గురించి ఈ వారం తెలుసుకుందాం.

ఆంగ్‌కోర్ వాట్ దేవాలయం కంపూచియాలోని సీమ్ రీప్ పట్టణానికి సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంది. హిందూ సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించే అద్భుతమైన శిల్పకళా నైపుణ్యం ఇక్కడ కనిపిస్తుంది. భారతీయ ఇతిహాసాలను తనలో ఇముడ్చుకుని అందరినీ ఆకట్టుకుంటోంది. అంతేకాదు ఈ దేవాలయం ఆ దేశ జాతీయ పతాకంలో కూడా స్థానం సంపాదించుకుంది.

ఈ ఆలయానికి కొన్ని దశాబ్దాల చరిత్ర ఉంది. ఖ్మేర్ సామ్రాజ్యంలో ఈ అద్భుత కట్టడానికి అంకురార్పణ జరిగింది. క్రీ.శ 12వ శతాబ్దకాలంలో ఆంగ్‌కోర్ వాట్‌ను రాజధానిగా చేసుకుని పాలించిన రెండవ సూర్యవర్మన్ కాలంలో ఈ ఆలయ నిర్మాణం జరిగినట్లు చరిత్ర చెబుతోంది. దీన్ని నిర్మించడానికి సుమారు 30 సంవత్సరాలు పట్టిందట. ఈ దేవాలయ నిర్మాణం మన దేశంలోని తమిళనాడు దేవాలయాలను పోలి వుంటాయి. తమిళనాడుకు చెందిన చోళరాజుల నిర్మాణ పద్ధతులు ఈ దేవాలయాల్లో కనిపిస్తాయి. అయితే ఈ దేవాలయాలన్నీ మిగతా వాటికి భిన్నంగా పశ్చిమ ముఖద్వారాన్ని కలిగి ఉన్నాయి. టోనెల్ సాస్ సరస్సు తీరాన సుమారు 200 చదరపు కిలోమీటర్ల వైశాల్యం కలిగి ఎంతో విశాలమైన ప్రాంగణంలో ఎన్నో దేవాలయాల సముదాయంతో ఆహ్లాద భరితంగా ఉంటుంది.

భారతదేశంలో కూడా ఇంత పెద్ద దేవాలయం లేదనే చెప్పాలి. అద్భుతమైన ఆర్కిటెక్చర్‌తో ఈ దేవాలయాన్ని రూపొందించారు. కులేన్ పర్వత శ్రేణుల పాదాల చెంత నిర్మించబడ్డ ఈ దేవాలయం ప్రపంచంలోనే అతిపెద్ద హిందూ దేవాలయంగా, విష్ణుమూర్తి ఆలయంగా వెలుగొందుతోంది. ఇందులోని ఆలయాలన్నీ హిందూ సంస్కృతికి దగ్గరగా ఉంటాయి.

ఇంజనీర్ల ప్రతిభ

ఖ్మేర్ సామ్రాజ్యంలో నీటిని నిల్వ చేసుకునేందుకు అద్భుతమైన టెక్నాలజీని ఉపయోగించారు. ఇక్కడి నీరు పల్లం నుండి ఎత్తుకు ప్రవహించేదట. అదే టెక్నాలజీని ఆంగ్‌కోర్ వాట్ దేవాలయంలో కూడా వాడారు. ఇది అప్పట్లోనే ఎలా సాధ్యమయ్యిందనే విషయం అందర్నీ ఆశ్చర్యపరుస్తుంది. ఐదు మైళ్ల పొడవు, ఒకటిన్నర మైలు వెడల్పుతో విశాలమైన రిజర్వాయర్లు(వీటిని అక్కడ 'బారే'లు అంటారు) నిర్మించడం ఆనాటి ఇంజనీర్ల ప్రతిభకు నిదర్శనం. ఈ రిజర్వాయర్లను వ్యవసాయ అవసరాలకు కూడా ఉపయోగించేవారట. ఫ్రెంచ్ ఆర్కియాలజిస్ట్ ఫిలిప్ గ్లోసియర్ ఈ రిజర్వాయర్లపై పరిశోధన జరిపి ఈ విషయాన్ని ధృవపరిచారు. నాసా చిత్రీకరించిన ఉపగ్రహ చిత్రాల ఆధారంగా పరిశోధనలు జరిపిన సిడ్నీ యూనివర్శిటీ ఆర్కియాలజిస్టుల పరిశోధన కూడా ఫిలిప్స్ అభిప్రాయాన్ని బలపరుస్తోంది. ఉపగ్రహ చిత్రాల్లో అప్పటి మానవ నిర్మితమైన నీటి ట్యాంకులు, కాలువలు, డ్యాములు చాలా స్పష్టంగా కనిపించాయట.

అద్భుతమైన దృశ్యాలు

ముఖద్వారం నుండి దేవాలయం లోపలికి వెళ్లగానే చుట్టూ పచ్చని పచ్చికతో అక్కడి వాతావరణమంతా ఆహ్లాదభరితంగా ఉంటుంది. ముఖద్వారం నుండే మూడు పెద్ద పెద్ద గోపురాలు దర్శనమిస్తాయి. ఇందులో మధ్య గోపురం నుండి లోపలికి వెళ్తే అనేక గోపురాలు కనిపిస్తాయి. ఈ దేవాలయంలో ముఖ్యంగా చెప్పుకోవాల్సింది సూర్యోదయం. ఉషోదయ వేళ ఆలయ దర్శనం అద్భుతంగా ఉంటుంది. పొద్దున పొద్దున లేచి గోపురం వెనుక నుండి ఉదయ భానుడు మెల్లిగా





క్షీరసాగర మథనం

నులి వెచ్చని లేలేత కిరణాల్ని ప్రసరింపజేస్తున్నప్పుడు గుడి గోపురాన్ని చూస్తే చాలు... ఎంతసేపైనా ఆ దృశ్యాన్ని అలాగే చూస్తూ ఉండి పోవాలనిపిస్తుంది. ఎండ వేడెక్కి చుర్రుమనిపించేవరకు అలాగే ఉండిపోతారు కూడా.

బ్యాస్ - రిలీఫ్స్

ఈ దేవాలయంలో మరో అద్భుతమైన ప్రదేశం బ్యాస్ – రిలీఫ్స్ గ్యాలరీ. నాలుగు గోడలతో నిర్మించిన ఈ మండపంలో ఎక్కడ చూసినా హిందూ పురాణ గాథలే కనిపిస్తాయి. ముఖ్యంగా తూర్పున ఉన్న 'మంటన్' అనే గ్యాలరీ అందర్నీ ఆకట్టుకుంటుంది. భారత పురాణాలైన రామాయణ, మహా భారత దృశ్యాలు అనేకం ఇక్కడ మనకు సాక్షాత్కరిస్తాయి. దేవతలూ, రాక్షసుల మధ్య జరిగిన క్షీరసాగర మథన దృశ్యాలు అందర్నీ ఆకట్టుకుంటాయి. తూర్పు వైపు మండపంలో విష్ణుమూర్తి పుట్టుక, అవతారాలకు సంబంధించిన శిల్పాలు ఉంటే పశ్చిమం వైపు మండపం గోడలపై యుద్ధాలు, మరణాలకు సంబంధించిన ఆకృతులు కనిపిస్తాయి. కురుక్షేత్ర యుద్ధం, రామ రావణ యుద్ధ సంఘటనలు ఎంతో చక్కగా మలచబడ్డాయి. ఇక దక్షిణ మండపంలో ఆలయాన్ని నిర్మించిన రాజు రెండవ సూర్యవర్మన్ రాజ్యానికి సంబంధించిన సైనిక పటాల దృశ్యాలు దర్శనమిస్తాయి. ఇవే కాక పురాణ పురుషులు, మునులు, కిన్నెర కింపురుషాధి అప్సరసల నాట్య విన్యాసాలు, యమధర్మరాజు కొలువుదీరిన యమసభ వంటి అనేక కళాఖండాలు ఆంగ్‌కోర్ వాట్ ఆలయ గోడలపై సాక్షాత్కరిస్తాయి.

ఈ పేరెలా వచ్చిందంటే...

ఇదంతా చదివిన తర్వాత భారతీయ సంస్కృతి ఆనవాళ్లే లేని కంపూచియాలో ఇంతపెద్ద హిందూ దేవాలయాన్ని ఎలా? ఎందుకు నిర్మించారనే ప్రశ్న తలెత్తే ఉంటుంది కదా? అసలు విషయానికొస్తే ప్రస్తుతం కంపూచియాగా పిలవబడే ఈ దేశాన్ని పూర్వకాలంలో 'కాంబోజ దేశం' అని పిలిచేవారు. సంస్కృత పదాలను సరిగ్గా ఉచ్చరించలేని యూరోపియన్లు, కాంబోజదేశాన్ని కంబోడియాగా మార్చేశారు. యూరోపియన్ వలస దేశాల అజమాయిషీలోకి వెళ్లిన తర్వాత కాంబోజ దేశం కాలక్రమంలో కంపూచియాగా మారిపోయింది.

దేశ చరిత్ర

పూర్వకాలంలో కాంబోజ దేశంలో హిందూ సంస్కృతే ఎక్కువగా ఉండేది. 9-15 శతాబ్దాల కాలంలో ఈ దేవాలయాన్ని నిర్మించిన రెండవ సూర్యవర్మన్‌తో పాటు అనేకమంది హిందూ రాజులు కంపూచియాను పాలించినట్లు చరిత్ర ద్వారా తెలుస్తోంది. చైనా రికార్డుల ప్రకారం ఈ ప్రాంతమంతా భరత ఖండానికి చెందిన రాజుల పాలనలో ఉంది. భారతీయ పురాతన సంస్కృత గ్రంథాలు కూడా ఈ విషయాన్ని రూఢి చేస్తున్నాయి. చోళ రాజ్యానికి చెందిన ఒక రాజు, టోనెల్ సాప్ నదీ పరివాహక ప్రాంతాన్ని ఏలుతున్న 'నాగ' అనే రాకుమార్తెను వివాహం చేసుకుని ఇక్కడ రాజ్యాన్ని ఏర్పాటు చేసినట్టు చారిత్రక ఆధారాలున్నాయి. ఖ్మేర్ సామ్రాజ్య పురాణగాథల ప్రకారం ఖ్మేర్ సామ్రాజ్యాధినేత అయిన 'కాము'తో భరత ఖండానికి సంబంధాలున్నట్లు తెలుస్తోంది. ఖ్మేర్ నాగరికత తర్వాత కొన్ని శతాబ్దాల అనంతరం భారతీయ సంస్కృతి కంపూచియాకు వ్యాపించింది. సంస్కృతం అధికార భాషగా హిందూ, బౌద్ధమతాలు అధికార సంప్రదాయాలుగా వెలుగొందాయి. జీవిత కాలంలో కనీసం ఒక్కసారైనా దర్శించాలనుకునే పర్యాటక ప్రాంతాల్లో ఆంగ్‌కోర్ వాట్ దేవాలయం ఒకటి.

అద్భుత నిర్మాణం ఆంగ్‌కోర్ థోమ్

ఆంగ్‌కోర్ వాట్ దేవాలయానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న మరో అద్భుత ప్రదేశం ఆంగ్‌కోర్ థోమ్. ఖ్మేర్ సామ్రాజ్యంలోని చివరి చక్రవర్తుల్లో ఒకరైన 'జయవర్మన్ - 6 ఆంగ్‌కోర్ థోమ్‌ను రాజధానిగా చేసుకుని రాజ్యాధికారం చేపట్టాడనడానికి చారిత్రక ఆధారాలున్నాయి. దీనినే 'గ్రేట్ సిటీ' అని కూడా అంటారు. తొమ్మిది చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఈ దేవాలయ నిర్మాణం జరిగింది. ఇక్కడ కూడా అనేక పురాణ కళాకృతులు మనకు దర్శనమిస్తాయి. ఇక్కడ బౌద్ధమత సంస్కృతి ఎక్కువగా ఉంది. ఏనుగుల మిద్దెలు, లెపర్ రాజు ప్రతిమలు, బెయాన్, బఫూన్ లాంటి అనేక నిర్మాణాలు ఇక్కడి ప్రత్యేకత. ఆంగ్‌కోర్ థోమ్ మధ్యలో చిన్న చిన్న మిద్దెలతో నిర్మించిన గోల్డెన్ టవర్ (బెయాన్) ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది. 54 అంతస్తులతో నిర్మించిన బెయాన్ (బుద్ధుని) దేవాలయంలో ఆంగ్‌కోర్ థోమ్‌కి ఆకర్షణీయంగా నిలుస్తుంది. ★



విష్ణుమూర్తి



'జుట్టున్నమ్మ ఏ కొప్పయినా పెడుతుంది' అనేది నానుడి...అయితే జుట్టున్నయ్య (శ్రీవారు) కొప్పు పెట్టట్లేదు కానీ... కోట్లు గడిస్తున్నాడు.. ఒకటి కాదు.. రెండు కాదు... ఏకంగా ఏడాదికి 300 కోట్ల రూపాయల సంపాదన. 'పాపాలన్నీ పోతాయి' అన్న భక్తుల సెంటిమెంట్ సిరులు కురిపిస్తోంది.. యూరోపియన్ దేశాల్లో మన భారతదేశ వెంట్రుకలకు మంచి గిరాకీ. మందుల కంపెనీల నుంచి హాలీవుడ్ నటుల విగ్గుల వరకు విరివిగా మన వెంట్రుకలను వినియోగిస్తుంటారు. వివిధ రసాయనాలతో కూడిన షాంపూల వాడకం వల్ల ఇతర దేశాల్లోని వెంట్రుకల నాణ్యత తక్కువగా ఉంటుంది. మన భారతదేశంలోని వెంట్రుకలు మాత్రమే సంప్రదాయ ఉత్పత్తులతో శుభ్రం చేస్తుండడం వల్ల నాణ్యత ఎక్కువ. ఎవరైనా 'గుండు'తో కనిపిస్తే 'కొండకెళ్లొచ్చావా!' అని అడగడం షరా మామూలే. ఏది ఏమైనా తిరుమల లడ్డు, తిరుపతి 'గుండు' శ్రీవారి స్పెషల్. కురుల నుంచి రాలుతున్న సిరుల విశేషాలేంటో ఈ వారం అట్టమీది కథలో చూద్దాం.

కురుల నుంచి సిరులు

- వళిగళం గోపి, అవనిగడ్డ వనజ

తీర్థోపవాస్త కర్తవ్య శిరసోముండనం తథా
శిరోగతాని పాపానియాంతి ముండన
తోయతః(పద్మపురాణం)

తీర్థక్షేత్రాల్లో తలనీలాలు సమర్పించినట్లయితే శిరస్సులో ఉన్న పాపాలు, అనగా బుద్ధిపూర్వకంగా చేసిన పాపాలన్నీ పోతాయని పురాణాలు చెబుతున్నాయి. కోరికలు నెరవేరిన వారు లేదా నెరవేరవలసినవారు, చంటిపిల్లల నుంచి వృద్ధుల వరకు, స్త్రీలు సైతం ఒక పవిత్ర యజ్ఞంగా భావిస్తూ తిరుమలలో తమ తలనీలాలను సమర్పిస్తారు. తిరుమల క్షేత్రాన్ని చేరుకున్న యాత్రికులు, భక్తులు ముందుగా సమర్పించే ప్రధానమైన మొక్కు తలనీలాల సమర్పణ. ఈ కార్యక్రమం కళ్యాణకట్ట భవనంలో జరుగుతుంది. తిరుమలలో క్రీ.శ. 1930 నాటికే తలనీలాల సమర్పణ ఉన్నట్లు తెలుస్తోంది. కళ్యాణకట్టతో పాటు భక్తులు విడిది చేసే [illegible]యూ కాటేజీల్లోనూ తలనీలాలు సమర్పించుకునే సౌకర్యాన్ని దేవస్థానం ఏర్పాటు చేసింది. తలనీలాలు అర్పించడం అనేది శుద్ధిలో ఒక ప్రక్రియ. అహంకార విసర్జనకు గుర్తు. కాలక్రమేణా అది మొక్కుగా మారింది.

సరిగ్గా 30 ఏళ్ల క్రితం కళ్యాణకట్టలో వెంట్రుకల క్రయవిక్రయాలకు లోకల్ మార్కెట్ ఉండేది. సవరాలు, కొప్పులు, నల్లతాళ్లకు గిరాకీ ఉండేది. చంద్రగిరి సమీపంలోని ఐతేపల్లి వద్ద సిస్టెయిన్ (బొచ్చు ఫ్యాక్టరీ) పరిశ్రమ ఇందుకోసమే వెలిసింది. ఉత్తర భారతదేశానికి చెందిన వారు ఈ ఫ్యాక్టరీని నిర్వహించేవారు. దాదాపు 300 మంది కూలీలు ఇక్కడ పనిచేసేవారు. కళ్యాణకట్ట నుంచి వెంట్రుకలను తీసుకొచ్చి కరిగించి పౌడర్, ఆయిల్ తయారు చేసేవారు. చైనా, అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలకు ఎగుమతి చేసేవారు. ఇవి ఎక్కువగా ఔషధరంగానికి ఉపయోగపడేవి. అయితే ఈ ఫ్యాక్టరీ వల్ల చుట్టుపక్కల పొలాలన్నీ బీడుగా మారిపోయాయి. నీరు కలుషితం కావడం వల్ల దాదాపు చుట్టుపక్కల వారు అనారోగ్యం పాలయ్యేవారు. దీని కాలుష్య ప్రభావం ఎంత తీవ్రంగా ఉండేదంటే మరో ఇరవై ఏళ్ల పాటు ఈ చుట్టుపక్కల పరిసరాల్లో పంటలు పండే పరిస్థితి లేదు. రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో 1999లో ఈ ఫ్యాక్టరీని మూసేశారు. దీంతో కళ్యాణకట్ట వెంట్రుకల మార్కెటింగ్ ప్రశ్నార్థకమయ్యింది. కేవలం చిరు వ్యాపారులు మాత్రమే కొనుగోలు చేసి సవరాలు, నల్లతాళ్ల తయారీకి మాత్రమే ఉపయోగించేవారు. మిగిలిన వెంట్రుకల నిల్వలను కాల్చేసేవారు.

ఏడుకొండలవాడికి ఎక్కువగా తలనీలాలను మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఇస్తుంటారు. అంటే 'పరీక్ష'ల సీజన్ అన్నమాట. పరీక్షలు అయిన వెంటనే పాస్ చేయాలని కొంతమంది, పాసైన వెంటనే కోరిన కోర్కె నెరవేరిందని 'గుండు' కొట్టించుకుని శ్రీవారికి 'ఓటాఫ్ థ్యాంక్స్' చెబుతారన్నమాట. విద్యార్థినులు ఎక్కువగా 'కత్తెర'లతో సరిపెడతారు. గుండు కొట్టించుకుని వెనక ఓ పిలక పెట్టుకోవడం ఉత్తరాది వారి సంప్రదాయం. మండు వేసవిలో గుండు కొట్టించుకున్న వారంతా చల్లగా ఉండేందుకు 'గంధం' పూస్తారు.

ఉపాధికీ...

కళ్యాణకట్ట భక్తి సేవకే పరిమితం కాలేదు. ఉపాధిని అందిస్తోంది. దాదాపు 600 మంది పనిచేస్తున్నారు. వారిలో 200 మంది పర్మినెంట్, 400 మంది పీస్‌రేటు బార్బర్లు. గుండుకు ఐదు రూపాయల చొప్పున టిటిడి చెల్లించాల్సి ఉంది. మూడు షిఫ్టుల ద్వారా కార్మికులు రేయింబగళ్లు సేవలు అందిస్తుంటారు. 60 మంది మహిళా క్షురకులు ఉండటం విశేషం. మూడేళ్ల క్రితం భారీ ఎత్తున పోరాడడంతో టిటిడి దిగివచ్చింది. మహిళా క్షురకులకూ కళ్యాణకట్టలో అవకాశం కల్పించింది. ఇది చారిత్రాత్మక పోరాటంగా నిలిచింది. ఆలయ హుండీ తరువాత అంతటి ఆదాయాన్ని శ్రీవారికి సమకూరుస్తున్న కళ్యాణకట్టను టిటిడి బలోపేతం చేయాల్సి ఉంది. భక్తుల రద్దీ దృష్ట్యా మరో 1500 మందికి ఉద్యోగావకాశం కల్పించాలని, అందరినీ పర్మినెంట్ కార్మికులుగా గుర్తించాలని, లేనిచో కళ్యాణకట్టలో ఏటా వస్తున్న ఆదాయంలో 50 శాతం బార్బర్లకు కేటాయించాలని క్షౌరవృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి దేవరకొండ నాగరాజు డిమాండ్ చేస్తున్నారు.

ఏటా కోట్లాది రూపాయల ఆదాయం

2007కు ముందు వెంట్రుకల ద్వారా వచ్చే ఆదాయం కేవలం 20 కోట్లే. ఈ విషయమై ప్రత్యేక చొరవ చూపి మార్కెటింగ్ వ్యవస్థపై కేంద్రీకరించాం. కాంట్రాక్టర్లు రింగ్ అయ్యి దేవస్థానం ఆదాయానికి గండికొట్టడాన్ని పరిశీలించాం. అప్పటి నుంచి గ్లోబల్ మార్కెట్ ద్వారా టెండర్లు పిలవాలని నిర్ణయించాం. ఆరుగురే ఉన్న కాంట్రాక్టర్లు ప్రస్తుతం 18 మంది అయ్యారు. గతంలో మూడు గ్రేడ్లు ఉన్న వెంట్రుకలను ఐదుగా విడగొట్టి ఆదాయం ఎక్కువ వచ్చేలా చూశాం. ఆరు నెలలకు ఒకసారి ఉన్న టెండర్ల ప్రక్రియను మూడు నెలలకు కుదించాం. 2007-08కి గాను ప్రతి మూడు నెలలకు 70 కోట్ల రూపాయలు టిటిడికి ఆదాయం వచ్చింది. హుండీ తరువాత అంతటి ఆదాయం శ్రీవారికి కళ్యాణకట్ట ద్వారానే వస్తుంది.

ఒవి రమణ, టిటిడి బోర్డు మాజీ సభ్యులు

మండుటెండలో గుండు పచ్చగా మెరుస్తూ ఉంటుంది. టోపీల వ్యాపారమూ ఎక్కువే. గుండు కొట్టించుకున్న ప్రతి ఒక్కరూ 'టోపీల'తో కవర్ చేస్తారు. ఒక్క తిరుమలలోనే 600 పైగా టోపీల షాపులు ఉన్నాయనడంలో అతిశయోక్తి కాదు.

యూరోపియన్ దేశాలైన ఇటలీ, బ్రిటన్, అమెరికా, ఆఫ్రికా, చైనాలో విగ్గుల సంస్కృతి దశాబ్దకాలంగా పెరిగింది. నాణ్యత, పరిమాణం రీత్యా మన దేశంలో ఉండే వెంట్రుకలకు మంచి గిరాకీ. ఔషధరంగంలోనే గాకుండా 'ఎల్' సిస్టైన్ అనే ప్రొటీన్‌ను ఆహార పదార్థాల్లోనూ వినియోగిస్తుంటారు. ఎక్కువగా జర్మనీ దేశాల్లో ఉపయోగిస్తారు. అలాగే హాలీవుడ్ నటీనటులు ఉపయోగించే విగ్గులు ఎక్కువగా భారతదేశ వెంట్రుకలతో తయారు చేసినవే. ఎందుకంటే ఇతర దేశాల్లో ఎక్కువగా రసాయనాలు ఉండే షాంపూలు ఉపయోగించడంతో వెంట్రుకలు దెబ్బతిని నాణ్యంగా కనిపించవు. గిడసబారి ఉంటాయి. అదే మన దేశంలో సంప్రదాయబద్ధమైన సీకాయ, కుంకుడుకాయను ఎక్కువగా వినియోగించడం వల్ల ఇక్కడి జుట్టులో మెరుపు, తేమ శాతం అధికంగా ఉంటుంది. అందుకే ఎక్కువగా భారతదేశ వెంట్రుకలకు గిరాకీ.

రోజుకు ఒక టన్ను చొప్పున, సరాసరి ఏడాదికి 270 టన్నుల వెంట్రుకలు కళ్యాణకట్టలో పోగవుతుంటాయి. కళ్యాణకట్టతో పాటు తిరుచానూరు, ఎటిసి, పద్మావతి, పిటిసి తదితర ప్రాంతాల్లో ఎక్కువగా తలనీలాలను సమర్పిస్తుంటారు. ఈ వెంట్రుకలన్నింటినీ గ్రేడింగ్ చేసి విడగొడతారు. దాదాపు ఐదు గ్రేడ్‌లుగా గుర్తిస్తారు. శ్రీవారికి సమర్పించే తలనీలాలను ఐదు గ్రేడ్‌లుగా విడగొడతారు. నాలుగు గ్రేడ్‌ల వరకు నల్ల వెంట్రుకలు. ఐదో గ్రేడ్ తెల్ల వెంట్రుకలు.

గ్రేడ్	పొడవు (అంగుళాలు)	టిటిడి నుంచి కొనుగోలు (కిలో)	విదేశాల్లో విక్రయ రేటు (కిలో)
మొదటిరకం	30-56	18వేలు	60వేలు
రెండో రకం	14-30	12వేలు	35వేలు
మూడో రకం	10-14	7వేలు	20వేలు
నాలుగో రకం	5-10	2వేలు	10వేలు
ఐదో రకం	తెల్ల వెంట్రుకలు	3వేలు	25వేలు



టిటిడి కళ్యాణకట్ట నుంచి 18 మంది కాంట్రాక్టర్లు టెండర్ల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. విదేశాలకు విక్రయించడంలో కలకత్తా, చెన్నయ్‌కి చెందిన నాలుగు



దేశ దేశాలకు.... మన కేశాలు

అత్తగారి ఆస్తికి/తానొక్కణ్నే మిగలాలని/ చదవకుండ పాసయ్యే/ పార్టుకట్లు దొరకాలని...కొండమీద దేవుడితో/ కోట్లమంది కాంట్రాక్టులు/ తలనీలాలిస్తామని / తిరుగులేని అగ్రిమెంట్లు/ముత్తానికి చౌకేలే/ నెత్తిమీద బొచ్చేగద!

గజ్జల మల్లారెడ్డి పూర్వాశ్రమంలో రాసిన ఈ కవిత హేతువాదులను బాగా అలరించేది గాని తిరుపతి దేవుడి తల నీలాల సమర్పణ యాగం మాత్రం సాగిపోతూనే వుంది. నఖ శిఖ పర్యంతం అని, శిఖామణి అని తల జుట్టును లేదా శిరోజాలను సౌందర్యానికి, గౌరవానికి సంకేతాలుగా పరిగణించడం సర్వసాధారణం. మహా భారతం నాటికే డజన్ల రకాల కేశాలంకరణలు వున్నట్టు విరాట పర్వం చెబుతుంది. అలాంటి నేలలో ఏపుగా పెంచుకున్న జుట్టును ఏకంగా ఇచ్చేయడం కొన్ని తరాలుగా కొనసాగుతున్న విశ్వాసం. గత అరవై ఏళ్లలోనూ ఇది మరింత పెరిగినట్టు చెబుతారు.

ఇక్కడ విశేషమేమంటే ఈ తిరుక్షవరానికి వారూ వీరని తేడా లేదు. అందాల తారల నుంచి అతి సామాన్యుల వరకూ అదే అర్పణం చేసేస్తారు. 1976లో మిస్ ఇండియాగా ఎన్నికైన ప్రముఖ ఈత క్రీడాకారిణి నసీఫా అలీ కూడా తన శిరోజాలను ఇచ్చేయడం మీడియాకు పెద్ద వార్త అయింది. 12 ఏళ్ల కిందటి మొక్కును తీర్చుకోవడం కోసం ఈ పని చేసినట్టు ఆమె అప్పట్లో చెప్పారు. "అయితే భక్తి పూర్వకంగా తాను సమర్పించిన తల నీలాలు గోతాముల్లో కట్టి వ్యాపార సంతకు తరలిస్తారని ఆమెకు తెలిసి వుండదని అప్పట్లో ఈ వార్త రాసిన స్వప్న మజుందార్ వ్యాఖ్య! తర్వాత ఏం జరిగినా అప్పటికి అది భక్తి. భారతీయ మహిళల కేశాలు చాలా పొడుగ్గా వుంటాయి గనక వాటికి హాలీవుడ్‌లో ప్రత్యేకమైన గిరాకి అట. పురుష భక్తుల జుట్టును ప్రొటీన్ తీసేందుకు ఉపయోగిస్తే మహిళల మాజీ జడలను మాత్రం విదేశాలకు తరలిస్తారు. వాటిని చిక్కు తీసి షాంపూతో శుభ్రం చేసి దువ్వి ఆరబెడతారు. వంకీల జుట్టుకు మరింత గిరాకి. ఏటా సుమారు కోటి 36 లక్షల టన్నుల శిరోజాలు ఓడకెక్కించి విదేశాలకు పంపిస్తారు. మనకన్నా ఎక్కువ జనాభా గల చైనీయుల జుట్టుతో మన జుట్టు ఎంచక్కా కలిసి పోతుందట. అందుకే వారు ప్రత్యేకంగా మన కేశ సంపద రావించి తమ వెంట్రుకలు కూడా కలిపి విగ్గులు సవరాలు తయారు చేసి పాశ్చాత్య దేశాలకు పంపి కురుల సిరుల పంట పండించుకుంటారు.

చైనా మన జుట్టుకు అది పెద్ద దిగుమతి దారే గాని వేరే వేరే చోట్లకు కూడా వెళుతున్నట్టు చెప్పారు కేశ ఎగుమతి విభాగాన్ని చూసే ప్రాంతీయ డైరెక్టర్ సుందర పాండ్యన్. అమెరికాకు కూడా మన జుట్టు ఎగుమతులు ముప్పై శాతం పెరిగాయట. ఐరోపా దేశాలు తెప్పించుకుంటున్నాయట. అమెరికాలోనైతే ఒక జడ కుచ్చుకు ఒకటిన్నర డాలరు ఇచ్చి కొన్నాక చివరకు విగ్గును 1500 డాలర్లకు అమ్మేసుకుంటారట!

1960 ల తర్వాత రాకపోకలు ప్రచారాలు పెరిగే కొద్దీ నీలాల సమర్పణ కూడా జోరందుకుంది.ఏటా దాదాపు కోటి మంది తిరుక్షవరం చేయించుకుని వెళుతున్నట్టు అంచనా.

ఇతర చోట్ల కూడా..

తిరుక్షవరంలో తిరుపతితో పోటీ పడలేకపోయినా ఇంకా పలు తీర్థయాత్ర ప్రదేశాల్లో తల నీలాల సమర్పణ వుంటుంది. తీర ప్రాంతంలో ద్వారకా తిరుమల అలాటి ఒక చోటు. కనక దుర్గ కొండపైన కూడా ఇలాటి ఏర్పాటు చూస్తాము. శ్రీశైలం, యాదగిరి గుట్ట,వేముల వాడ వగైరా చోట్ల దేవాలయల్లో భక్తులు నీలాలు సమర్పిస్తుంటారు. ఇవే గాక చెప్పుకోదగిన పెద్ద దేవాలయాలన్నిటిలోనూ ఇందుకు అవకాశం వుంటుంది. కాకపోతే ఒక్కో చోట ఒక్కో సీజన్. పండుగలు సెలవులు తిరుణాలల వంటి సమయాల్లో ఉధృతంగానూ మామూలు రోజుల్లో మందకొడిగానూ ఇది జరుగుతుంది. కేశ వ్యాపారం చేసే వారు ఈ దేవాలయాలతో ముందే అవగాహనకు వచ్చి వేలం పాడుకుంటారు.ప్రముఖ యాత్రా స్థలాల్లోనైతే లక్షలు అడ్వాన్సుగా కట్టి వుంచుతారు. నీలాలు సేకరించిన తర్వాత వాటిని శుభ్రం చేసి సవరాలు విగ్గులు చేసేందుకు పనివారిని కూడా పెద్ద సంఖ్యలోనే వినియోగిస్తారు. పోనీలు లేదా పొట్టి జుట్టు రాకముందైతే మన దేశంలోనూ వీటికి ఎక్కువగానే గిరాకి వుండేది.ఇప్పుడు విదేశాలకు ప్రధానంగా పంపిస్తున్నారు.హైదరాబాదు పార్శీ గుట్ట, ఎల్బీ నగర్ వంటి చోట్ల ఇలాంటి వ్యాపార సంస్థలున్నాయి. వీటి నుంచి బ్రెజిల్, రష్యా అమెరికాలకు ఎగుమతి జరుగుతుంది. ఇది దేవుడికిచ్చిన నీలాల సంగతైతే వీధుల్లోనూ జుట్టు సేకరించుతామంటూ తిరిగేవారు కనిపిస్తుంటారు. పార్శీ గుట్టనైతే జడసవరాల బస్తీ అని పిలుస్తారు కూడా. వీటిని అందంగా హెయిర్ ఎంటర్‌ప్రైజెస్ అని సంబోధిస్తారు.

కంపెనీలు ముందున్నాయి. తక్కువ ధరకు టిటిడి నుంచి కొనుగోలు చేసి విదేశాల నుండి భారీగా లాభాలను ఆర్జిస్తున్నాయి. పేరుకు మాత్రం ప్రతి మూడునెలలకు గ్లోబల్ టెండర్లని పిలిచినా 18 మంది కాంట్రాక్టర్లు మాత్రమే సొంతం చేసుకుంటున్నారు.

శ్రీవారికి తలనీలాలు సమర్పించే ప్రతి ఒక్కరూ పది రూపాయల చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు రోజుకు 30వేల మంది భక్తులు కళ్యాణకట్టలో తలనీలాలను సమర్పిస్తూ ఉంటారు. ఈ లెక్కన రోజుకు 3 లక్షల రూపాయల ఆదాయం టిక్కెట్ల రూపంలో వస్తోంది. నెలకు 90 లక్షలు కాగా, ఏడాదికి పది కోట్లకు పైగా ఆదాయం వస్తోంది.

ఇంతటి ఆదాయాన్ని అందిస్తున్న కళ్యాణకట్టకు ప్రత్యేక విభాగం అంటూ లేకపోవడం గమనార్హం. ఏటా హుండీ ద్వారా 650 కోట్లు వచ్చే పరకామణికి ఇద్దరు డిప్యూటీ ఇఓలు, ముగ్గురు ఏఇఓలు, 300 మంది సిబ్బంది ఉన్నారు. వెంట్రుకలు భద్రపరిచే శాఖకు కేవలం ఒక డిప్యూటీ ఇఓ కూడా లేకపోవడం గమనార్హం. గ్రేడింగ్ చేసి టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లకు అందించే ప్రక్రియ వరకు 10 మంది సిబ్బంది మాత్రమే ఉన్నారు. కాంట్రాక్టు కార్మికుల ద్వారా పనులు చేయించుకుంటున్నారు. సిబ్బందికి గ్లౌజ్‌లు, ముక్కుకు మాస్క్‌లు ఇవ్వకపోవడం వల్ల ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులు వస్తున్నాయి.

శ్రీవారికి సిరులు కురిపించే వెంట్రుకల అమ్మకాలపై టిటిడి నిర్లక్ష్యపూరితంగా వ్యవహరిస్తోంది. టిటిడిలోని విభాగాల మధ్య సమన్వయ లోపం వల్ల గోదాముల్లో నిల్వలు మగ్గుతున్నాయి. గత ఏడాది జూన్‌లో టెండర్లను పిలిచి నిల్వలను విక్రయించారు. అప్పటినుంచి ఇప్పటివరకు టెండర్లను పిలవలేదు. అయితే టెండర్లను త్వరలో పిలుస్తామని డిప్యూటీ ఇఓ ఉమాపతి చెపుతున్నారు. టిటిడి నిర్ణయించిన ధరకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంవల్లే టెండర్ల ప్రక్రియ నిలిచిపోయిందంటున్నారాయన.

సిరులు కురిపిస్తున్న కురుల పట్ల అంత నిర్లక్ష్యమేల!

★

అరటి పువ్వు కూర

కావలసిన పదార్థాలు

అరటి పువ్వు - 1, పెసరపప్పు - 2 టీ స్పూన్లు
పచ్చిమిర్చి - 4, ఉప్పు - తగినంత
పసుపు - చిటికెడు, ఆవాలు - 1 స్పూను
జీలకర్ర - 2 స్పూన్లు, మినపప్పు - 1 స్పూను
పచ్చి కొబ్బరి తురుము - 4 స్పూన్లు, నూనె - 2 స్పూన్లు

తయారు చేసే విధానం

అరటి పువ్వులో పచ్చిమిర్చి వేసి దంచి పెట్టుకోవాలి. నూనె వేడి చేసి ఎండుమిర్చి, జీలకర్ర, ఆవాలు, మినపప్పు వేసి పోపు పెట్టుకోవాలి. అందులో దంచిన అరటి పువ్వు మిశ్రమం, ఉప్పు, పసుపు, నానబెట్టిన పెసరపప్పు, పచ్చికొబ్బరి తురుము వేసి ఉడకనివ్వాలి. (గమనిక : అరటిపువ్వు ఒలిచేటప్పుడు అందులో చిన్న కాడ చేదుగా వుంటుంది. దాన్ని తీసెయ్యాలి. లేదంటే కూరంతా చేదవుతుంది.)





తెల్ల వంకాయలు - ఉల్లికారం

కావలసిన పదార్థాలు

తెల్ల వంకాయలు - అరకిలో, ఉల్లిగడ్డలు - 4
కారం - 2 స్పూన్లు, జీలకర్ర - 1 టీ స్పూను, ఉప్పు - తగినంత

తయారు చేసే పద్ధతి

ఉల్లిగడ్డముక్కలు, జీలకర్ర, ఉప్పు, కారం కలిపి దంచిపెట్టుకోవాలి. వంకాయలను నాలుగు ముక్కలుగా తరగాలి. నూనెలో వేసి ఐదునిమిషాలు వేగనివ్వాలి. తర్వాత ముందుగా నూరి పెట్టుకున్న ఉల్లికారాన్ని అందులో వేసి కలిపి మగ్గనివ్వాలి. అంతే తెల్లవంకాయలు ఉల్లికారం రెడీ.

అరటి బొందె కూర

కావలసిన పదార్థాలు

అరటి బొందె చిన్న చిన్న ముక్కలు- 2 కప్పులు
పెసరపప్పు - 1 టీ స్పూన్, మిర్చి - 4, జీలకర్ర - 2 టీ స్పూన్లు
మినపప్పు - 1 టీ స్పూను, ఆవాలు - 1 టీ స్పూను, కరివేపాకు - 2 రెమ్మలు
పచ్చికొబ్బరి తరుగు - 4 స్పూన్లు, ఉప్పు - తగినంత, పసుపు - చిటికెడు
కొత్తిమీర - కొద్దిగా, నూనె - 2 స్పూన్లు

తయారు చేసే విధానం

కాగిన నూనెలో ఎండుమిర్చి, జీలకర్ర, ఆవాలు, మినపప్పు వేసి పోపు చెయ్యాలి. తర్వాత మిర్చి ముక్కలు, కరివేపాకు, అరటి బొందె ముక్కలు, ఉప్పు, పసుపు వేసి కొంచెం నీళ్లుపోసి ఉడకనివ్వాలి. ఉడికిన తర్వాత నానిన పెసరపప్పు వేసి నీరు ఇంకిపోయే వరకు వేపాలి. చివరిలో పచ్చికొబ్బరి, కొత్తిమీర వేసి బాగా కలిపి దించేయాలి.



అరటికాయ మసాలా వేపుడు

కావలసిన పదార్థాలు

అరటికాయలు - 5, శనగపప్పు - 3 టీ స్పూన్లు
మినపప్పు - 1 టీ స్పూను,
జీలకర్ర - 2 టీ స్పూన్లు
ధనియాలు - 2 టీ స్పూన్లు, ఎండుమిర్చి - 10
నూనె - 2 టేబుల్ స్పూన్లు, ఉప్పు - తగినంత
పసుపు - చిటికెడు, కరివేపాకు - 2 రెమ్మలు

తయారు చేసే విధానం

బాండీలో అర స్పూను నూనె వేసి వేడి చేయాలి. అందులో శనగపప్పు, మినపప్పు, జీలకర్ర, ధనియాలు, ఎండుమిర్చి వేసి వేయించుకోవాలి. చల్లారాక వాటిలో ఉప్పు వేసి పొడి చేసి పెట్టుకోవాలి. అరటికాయలు ఉడకబెట్టిన తర్వాత పై తోలు తీసి గుండ్రంగా ముక్కలు తరగాలి. ఇప్పుడు బాండీలో నూనె వేసి కాగాక ఉడకబెట్టిన అరటికాయ ముక్కలను వేయించాలి. తర్వాత పొడి చేసిపెట్టుకున్న పప్పుల మిశ్రమం, పసుపు, కరివేపాకు అందులో వేసి కలపాలి. అంతే అరటికాయ మసాలా వేపుడు రెడీ. దీన్ని పిల్లలు చాలా ఇష్టంగా తింటారు.

ఆహ్వానం

ఘుమఘుమలాడే వంటకాలు చేయడంలో మీకు ఎనలేని ఆసక్తి వుందా! ప్రయోగాత్మక వంటకాలు చేసి అతిథులకు వడ్డించి మెప్పించగలరా! చవులూరింపచేసే సంప్రదాయ శాకాలు చేయడంలో దిట్టా! మరెందుకండీ ఆలస్యం? ఎంచక్కా వాటిని ఓ కాగితం మీద రాసి పంపండి. తగిన పారితోషికం అందుకోండి. ముఖ్యమైన విషయం! మీ చిరునామా పూర్తిగా రాయడం మరువకండి.

మీ రుచులు పంపాల్సిన మా అడ్రస్:
రుచి, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, మోటూరు హనుమంతరావు భవన్, 21/1, ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాదు.

చిన్న కోరిక

- యర్నాగుల సుధాకరరావు

ముప్పయ్ఏళ్ల నాటి సంఘటన ఇప్పటికీ నామనస్సులో మెదులుతూనే ఉంది. ఎందుకంటే ఆ సంఘటన అంత బరువైనది. ఎంతో హేయమైనది. స్ఫురణకు వస్తే గగుర్పాటు కల్గించేదే.

ఒకరోజు కాలుకాలిన పిల్లిలా రోడ్లమీద తిరిగాను. ఏదైనా వార్త కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాను. అప్పట్లో విలేకరి అంటే ఒకరకమైన భయం ఉండేది. ఏం మాట్లాడితే ఏమవుతుందో, మరుసటిరోజు పత్రికలో దాని గురించి ఏం రాస్తారో అనే అనుమానం, అపోహలతో ఉండేవారు. అందుకే నన్ను అక్కడి సిబ్బందంతా అదోలా చూసేవారు. పై అధికారి ఏం చెప్పాలన్నా భయపడుతుండేవాడు. ఎలాంటి వివరాలు అడిగినా చెప్పేందుకు ఇష్టపడేవాడు కాదు. విలేకర్లకు ఎలాంటి ఆహ్వానాలు ఉండేవికావు. తెలుసుకుని వెళ్లి వార్త సేకరించుకోవడమే. ఇది అప్పటి జర్నలిజం తీరుతెన్నులు.

"ఈరోజు పోలీసులు 'చింతచెట్టు సరుకు'ను రిక్షాల్లో ఎక్కించుకుని పోయి గుండ్లు గీయిస్తున్నారు" అని నా చెవిన వేశాడు సిన్మాహాలు గేట్‌మాన్.

సైకిల్ అటు తిప్పాను. పోలీస్‌స్టేషన్ ముందు ఆరుగురు యువతులు తలలు దించుకుని ఉన్నారు. పోలీసులు లాఠీలు ఝుళిపిస్తూ "అక్కడ కూర్చోండి. మీకు నున్నగా గుండ్లు గీస్తేగాని మీ వంకరబుద్ధి పోదు" అని వాళ్లని నెట్టాడు. సరిగ్గా అప్పుడే వెళ్లాను. నా ఆగ్‌ఫా కెమెరాతో రెండు ఫొటోలు తీశాను. అందులో ముగ్గురికి గుండ్లు గీసేశారు. ఒకామె నున్నటి గుండుపై కత్తిగాటు పడి రక్తం చిమ్ముతోంది. ఆమె తలని తడుముకుని రక్తం చేత్తో తుడుస్తోంది. నాకు గుండె ఎవరో నలిపినంతగా బాధ అనిపించింది.

"ఇది పోలీస్ స్టేషనా? లేక శిక్షలు విధించే కార్ఖానానా?అని కానిస్టేబుళ్లని అడిగాను.

వారికి రోషం పొడుచుకుని వచ్చింది. రాణా లోపలకి పోయి సబ్‌ఇన్‌స్పెక్టర్‌కు చెప్పారు. అతడు కోపంగా వచ్చి "విలేకరిచే చెప్పించుకునే స్థితిలో లేము. నీ పనేంటో చూసుకునిపో! నీకు మేం జవాబుదారులమా? అసలు ప్రెస్ వాళ్లకు రాణా వార్తలు ఏమీ చెప్పం. ఇక వెళ్లొచ్చు. ఈ చెత్తసరుకుతో ఊరంతా పాడయిపోతోంది. షుగర్ ఫ్యాక్టరీ ఆవరణంతా వీళ్లవల్ల నానా న్యూసెన్స్‌గా ఉంది. ఎన్ని రైడింగులు చేసినా వీళ్లు మానరు" అని చేతిలో లాఠీని నేలకేసి కొట్టాడు.

"సార్ మీ డ్యూటీ మీరు చేయండి. కోర్టుకు తీసుకెళ్లండి. అక్కడ శిక్ష వేస్తారు. ఇలా గుండ్లు గీయడం ఏం బాలేదు. ఇప్పటికైనా ఆపండి. లేకుంటే నేను ఇప్పుడే మీ యస్పీగారితో చెబుతాను"

యస్పి అనగానే సబ్‌ఇన్‌స్పెక్టర్ మెత్తబడిపోయి "ఈ ఆరుగురిని పంపించేయండి. మరోసారి వీళ్లు కన్పించకూడదు" అని కానిస్టేబుళ్లపై చిరాకు పడుతూ వెనుదిరిగాడు.

అంతవరకు ముఖాలు వేలాడేసిన ఆరుగురు ఏడుస్తూనే రోడ్డుమీదకెళ్లి రిక్షాలు ఎక్కారు. అప్పుడే వచ్చిన ఆ యువతుల ఓనర్ గురువులు నావద్దకు వచ్చి "బాబూ!గండం గట్టెక్కింది. లేకుంటే ఈళ్లమీద పెట్టిన పెట్టుబడి ఆరేడుమాసాల వరకు రాదు. కోర్టుకు వెళ్తే ఫైన్‌వేసి వదిలేస్తారు. ఇలా పోలీసులు గుండు కొట్టి వదిలేస్తే ఇంకేమైనా ఉందా? ఏ విటుడూ వాళ్లదగ్గరికి రాడు. బాబూ నువ్వు ఎప్పుడు వచ్చినా ఆ ఇంటి తలుపులు తెరిచే ఉంటాయి" అని వెకిలిగా నవ్వేసి వెళ్లిపోయాడు.

మరుసటిరోజు పత్రికలో 'ముగ్గురు యువతులకు గుండ్లుగీసిన పోలీసులు' అని పెద్ద న్యూస్‌ఐటమ్ వచ్చింది. దానిపై యస్పీ సీరియస్ అయ్యాడు. యస్ఐని పిలిచి చీవాట్లేశాడు. పోలీసులు రెడ్‌లైట్‌పై దృష్టి పెట్టడం లేదు. దాంతో గురువులుకి అడ్డే లేకుండా పోయింది. ఎక్కడ కన్పించినా వంగివంగి దండాలు పెట్టి, "మాంఛి సరుకు వచ్చింది. ఈరోజు రండిబాబు" అని స్వాగతిస్తుండేవాడు. సన్నగా నవ్వి తలపంకించేవాడిని. ఏరోజూ ఆ గుమ్మం తొక్కలేదు. ఎందుకో ఆ యువతులంటే నాకు ఎనలేని జాలి.

మూడురోజుల తర్వాత మధ్యాహ్నం మా ఇంటికి ఒక యువతి వచ్చింది. 'లోపలకి రావచ్చా?'అని అడిగి గుమ్మంలోనే నిలబడింది. ఆమె ఎవరోకాదు మొన్న ఆరుగురు యువతుల్లో ఒకామె. రమ్మన్నాను.

"నాలాంటిది వస్తే మీ వీధంతా ఊసులేసుకుంటారు కదా!" అని నవ్వి నేను చూపిన కుర్చీలో కూర్చుంది.

"ఆరోజు మీరు నాకా గుండు బారినుంచి రక్షించారు. ఆడదానికి జడవేసుకుంటేకదా అందం" అని తన పొడవైన జడను ఒళ్లోవేసుకుంది.

"నీరాక ఊరంతా ఏమనుకున్నా నాకు భయం లేదు. నా దగ్గరికి చట్టవ్యతిరేకులు ఎందరో వస్తారు. వాళ్ల దగ్గరికి నేను వెళ్తుంటాను. నేను జర్నలిస్టును కదా తప్పదు. సరే, ఏ పనిమీద వచ్చావు?"

"ఆరోజు మీరు చేసిన మేలు మర్చిపోలేను. మీగురించి ప్రతిక్షణం ఆలోచిస్తున్నాను. మాదగ్గరికి వచ్చిన వాళ్లే ఆరోజు పోలీసుస్టేషన్లో మాకు గుండ్లుగీస్తుంటే నవ్వారే తప్ప, ఒక్కరూ ఇది తప్పని అనలేదు. మాతో ఎలాంటి సంబంధమూ లేని మీరు మాకోసం పోలీసులతో గొడవ పడ్డారు. ఇంకొంచెం ముందు వస్తే, ఆ ముగ్గురికీ గుండు చేసేవారు కాదు. మేమంతా మీకు రుణపడ్డాం" అందామె చేతులు జోడించి.

"ఎందుకు ఈ వృత్తిలోకి దిగావు. ఎంతో చక్కగా ఉన్నావు. బాగా మాట్లాడుతున్నావు. నువ్వు చేస్తుంది తప్పని తెలిసి కూడా ఎందుకు చేస్తున్నావ్? మరోమార్గం వెతుక్కోవచ్చు కదా? అప్పుడు ఎవరికీ భయపడక్కర్లేదు"

"నాకూ అందరి ఆడపిల్లల్లా బతకాలనే ఉండేది. ఏమి లాభం? తల్లి లేనిదాన్ని. తండ్రి పచ్చి తాగుబోతు. నన్న ఆయనే రెండువేలకి ఒక వ్యభిచార గృహానికి అమ్మేశాడు. అది మొదలు ఈ ఊబిలోంచి బయట పడలేక రోజులు వెళ్లదీస్తున్నాను. ఇప్పుడు నాతో ఉన్న మిగతావాళ్లు

కూడా ఇష్టపడి అక్కడ ఉండడం లేదు. మాకెవరు పని ఇస్తారు? దూరం వెళ్లిపోయి బతకాలనుకుంటే అక్కడ ఒంటరి ఆడదానికి రక్షణ ఏముంటుంది. మళ్లీ ఇదే కథ" అంది.

"నీవాదన నీవరకు నిజమే కావచ్చు. కానీ, నాకు అంత కరెక్టు అనిపించడం లేదు. మంచిగా బతకడానికి ఎన్నో దారులున్నాయి"

"సరే, నాకథ వదిలేయండి. మా ఓనర్ గురువులు ఎన్నిసార్లు పిలిచినా మా ప్రేమ్‌నగర్‌కు రావడంలేదెందుకు?"

"నేను ఇలాంటివి ప్రోత్సహించను"

"ఎప్పుడైనా నామనసు బావుండనప్పుడు మీతో ఇలా మాట్లాడ్డానికి రావచ్చా?" వెళ్లబోతూ అడిగింది.

"ఈరోజు ఇంటి దగ్గరున్నాను. కానీ ఎక్కువగా ఆఫీసు పనిమీద బయటే ఉంటాను. సాధ్యమైనంత త్వరగా నువ్వు ఓ మంచిమార్గం వెతుక్కో. అప్పుడు సంతోషించేవాళ్లలో నేనూ ఉంటాను"

నవ్వుతూనే వెళ్లిపోయింది. రెండువారాల తర్వాత జ్వరమొచ్చి ఆసుపత్రిలో కూర్చుని ఉంది. ఏమయిందని అడిగాను. ఆమెకంటే ముందు చాలామంది పేషెంట్లున్నారు. మరో గంట అవుతుంది. నేనే చొరవగా డాక్టరుకు చెప్పి ఆమెను చూసేట్టు చేశాను. ఆమెతో బాటు నేనున్నాను.

"నువ్వు ఆ వృత్తి మానుకో! నీకు వెనీరియల్ డిసీజ్ ఏదో వచ్చినట్టుంది. అందుకే జ్వరమొచ్చింది. కొన్ని టాబ్లెట్లు రాసిస్తాను. అవి వేసుకో" అని చెప్పి "ఏయ్ దివాకర్! ఇలాంటివారితో తిరక్కు. చాలా ప్రమాదం. లేతకుర్రాడివి. చచ్చూరుకుంటావు" అని డాక్టర్ నాపై చిరుకోపాన్ని ప్రదర్శించాడు.

"డాక్టర్! ఈ టాబ్లెట్లతో ఆమెకి తగ్గిపోతుందా?"అని చీటీ తీసుకుని అడిగాను.

"నువ్వు వినేట్టు లేవు. తగ్గుతుంది. చాకులాంటి జర్నలిస్టువి. ఇలాంటి పరిచయాలు ఏంటి? నువ్వు ఒకసారి టెస్టు చేయించుకో! నేను జిల్లా ఆసుపత్రికి రేపు వెడుతున్నా. అక్కడికి వచ్చి టెస్టు చేయించుకో!" అని తన ధోరణిలో డాక్టర్ చెప్పుకుపోతున్నాడు.

నా పక్కనే ఉన్న ఆమె కళ్లు వర్షిస్తున్నాయి.

టాబ్లెట్లు, రొట్టె కొనిచ్చాను. నడవలేకపోతుంటే రిక్షాకు డబ్బులిచ్చి పంపేశాను.

ఆ తర్వాత పదిరోజులకి మళ్లీ సంతలో ఎదురయ్యింది.

"జ్వరం తగ్గిపోయినట్లుంది. ఇక్కడేంటి?"

"ఈ మంగళవారం కోడిపుంజు మొక్కుకున్నాను. ఆరోజు మాఇంటికి రండి. ఎవరూ ఉండరు. నేనూ మావాళ్లు మాత్రమే ఉంటాం" ఉత్సాహంగా చెప్పింది. రెండుపుంజులు కొనుక్కుని రిక్షా ఎక్కింది. అప్పుడే ఇద్దరు యువకులు రిక్షాకు అడ్డుపడి "సొరాజ్జం ఉండిపోరాదు" అంటూ రెక్కపట్టుకుని ఆమెను దించే ప్రయత్నం చేశారు.

"ఏయ్ వదులు. నాకు ఒంట్లో బాగోలేదు. ఏదో కొద్దిగా తెరిపిస్తే వచ్చాను" అని చేతిని విసురుగా లాక్కుంది. రిక్షా ముందుకు పోయింది.

ఆ దృశ్యం చూసాక నాకేమి అనిపించలేదు. ఆమె అంగడి బొమ్మ. వారిపై మగాడు హక్కు పొందిన వాడిలా ప్రవర్తిస్తాడు. అక్కణ్నించి సంతలో మొదలయిన ఆవులను కబేళాలకు తరలింపుపై అడ్డుకట్టలు వేద్దామని ఫోటోలు తీశాను.

ఆ తర్వాత ఒకగుడిలో స్వరాజ్యం కన్పించింది. ఆరోజు గుడి కళకళలాడుతోంది. కొత్తజంటలు వచ్చిపోతున్నారు .వారిని చూస్తూ కూర్చుంది. నన్నుచూసి నవ్వి తనకెదురుగా కూర్చోమంది.

"పర్వాలేదు చెప్పు. ఆరోజు రాత్రి చాలావరకు మీగురించి చూశాను. మీరు రాలేదు. సంతలో ఆవెధవలు నారెక్కపట్టుకున్నందుకు నామీద అసహ్యం వేసింది కదూ"

"అవన్నీ మీకు మామూలే. కానీ నాకు ఇబ్బంది అనిపించింది. ఉన్నంతలో సంసార పక్షంగా ఉన్నావు. పండుగ రోజుల్లో నువ్వు ముఖం అంతా పసుపు రాసుకుని గుడిచుట్టూ తిరుగుతున్నావు"

నామాటలకు ఆమె వేదాంతిలా నవ్వింది.

"నేను మిమ్మల్ని ఎన్నిసార్లు పిలిచినా మాఇంటికి రాలేక పోయారు. ఇదే నాచివరి కోరిక. తీరుస్తారా?" అని నాకళ్లలోకి ఆశగా చూసింది.

"నీ ఇంటికి రాకపోవడానికి నీవు ఉండే ప్రదేశం నీ ఆధీనంలో లేదు. అసలు నీకు నువ్వే అమ్ముడు పోయిన దానివి. అక్కడికి వచ్చి ఇవన్నీ చూడాలి. ఎందుకో నిన్ను తప్పుగా చూడాలనిపించడం లేదు"

"సార్ నాకోరిక తీర్చగలరా! విన్నవించుకోనా! చిన్నకోరిక!!" అని ముఖమంతా నవ్వులు నింపుకుంది.

"చెప్పు. తీర్చగలిగినదైతే తప్పకుండా"

"రేపు నాతో శ్రీకూర్మం రావాలి. అంటే కొన్నిగంటలు మీరు నాభర్త. నేను మీభార్యను. కేవలం గుడిలోకి వెళ్లి రావడం వరకే. ఆ తర్వాత మనమధ్య ఏమీ ఉండదు" అని చెప్పి ఆ పక్కనే వెళ్తున్న కొత్త జంటలను చూపించి "ఈ ధీనురాలికీ వారిలా భర్తతో గుడికి, సినిమాకు వెళ్లామనే కోరిక ఉంది. ఈపిచ్చిదాని కోరిక మీరు తీర్చగలరా?" అని ఆశగా చూసింది.

ఆమాటలకు కొన్నిక్షణాలు ఆమెనే చూస్తూ ఉండిపోయాను. ఈమెలో అందరి అమ్మాయిల్లాంటి కోరికలే ఉన్నాయి. అయితే వాళ్ల నాన్న చేసిన తప్పుకు ఈమె అంగడి బొమ్మయ్యిందనిపించింది.

సరే, రేపు పదింటికి శ్రీకూర్మం బస్టాండులో ఉంటాను కలిసి వెళ్దాం. నాఫ్రెండు బైక్ తీసుకొస్తాను. నిన్ను సినిమాకు తీసుకెళ్లి నీఇంటి దగ్గర దింపేస్తాను. నీకోరిక చిన్నదే. కానీ, నాలా ఎవరూ ముందుకు రారు. సమాజానికి భయపడతారు. నీకోసం ఆ సమాజాన్ని పట్టించుకోను" చెప్పి వెనుదిరిగాను.

నేను ఇచ్చిన మాట ప్రకారం మరుసటి రోజు శ్రీకూర్మం బస్టాండులో ఉన్నాను. ఎంతసేపయినా ఆమె రాలేదు. ఆరోజుల్లో ల్యాండ్‌లైన్లే తక్కువ. సెల్ జాడలేదు. చాలాసేపు చూసి వెనుదిరిగాను.

ఆరుమాసాలు అయ్యింది. స్వరాజ్యం జాడలేదు. గురువులు కన్పించినా అడగడం బావుండదని అడగలేదు. ఒక్కోసారి ఆమెని చూడాలనిపించే కోరిక బలంగా ఉండేది. ఈసారి గురువులు కన్పిస్తే అడగాలని అనుకున్నాను. కావాలనే అతడుండే పరిసరాల్లో తిరిగాను. ఎదురయితే అడిగాను.

"సొరాజ్జమా బాబూ! అది వైజాగ్ వెళ్లిపోయింది. అక్కడ బాగానే ఉంది. కానీ తాగుబోతు ఎదవలు రాత్రికని చెప్పి తీసుకెళ్లి, చంపి ఆచావుల మదుము వద్ద పడేసి పోయారు. దీపావళి రోజున దానికి చావు మూడింది. మంచిపిల్ల. దేవుడూ... దయ్యం... అనేది. కూర్మం వెళ్తానంది. కానీ, చూడకుండానే మరో కంపెనీకి పంపేయాల్సి వచ్చింది. ఇక్కడుంటే బతికుండేదేమో?" బాధపడుతూ చెప్పాడు.

దీపావళి అయిపోయి ఆరేడుమాసాలయ్యింది. వెంటనే ఇంటికి వచ్చి పేపర్లు వెతికాను. అందులో 'యువతి హత్య హంతకులు పరార్' అని ఉంది. గొంతు నులిమి చంపబడింది. ఆవార్త ఒకటికి పదిసార్లు చదివాను. కళ్లలో నీళ్లు తిరిగాయి.

అయ్యో ఆమె చిన్న కోరిక తీర్చలేకపోయాను. నాచెవుల్లో ఇప్పటికీ ఆమె కోరిన కోరిక గింగురుమంటోంది. ★

తెల్సా!

అతనికి నిద్ర రాదు

ఒక్కరాత్రి ప్రయాణం చేస్తేనే...మరునాటికి అలసిపోతాం. బోలెడంత అలసట...బడలిక..ఇలాంటి పదాలెన్నో మన నోటెంట వచ్చేస్తాయి. ఇదంతా ఒక్కరాత్రి నిద్ర కాచినందుకే. మరి 38 ఏళ్లగా నిద్ర పట్టకపోతే! 'అమ్మో! ఇంకేమైనా వుందా?!' అని భయపడిపోకండి. థాయ్ గాక్ అనే వియత్నాం వాసి కంటి నిండా నిద్రపోయి చానా ఏళ్లయింది. అప్పుడెప్పుడో 1973లో ఆయనకు జ్వరం వచ్చింది. ఇంక అప్పటినుంచి ఇప్పటి వరకు నిద్రే లేదు. రాదు. అలా కళ్లు తెరచుకుని వుండాల్సిందే. అయితే దాని వల్ల ఆరోగ్యపరమైన సమస్యలేమీ రాలేదాయనకు. పొలంలో పందులు, కోళ్ల ఆలనా పాలనా చూసుకుంటాడు. పొలం పనులు చేస్తాడు. వందకేజీల ఎరువును భుజానికెత్తుకుని నాలుగేసి కిలోమీటర్ల దూరం వరకు మోస్తాడు. రాత్రుళ్లు పంట నాశనం కాకుండా పొలం కాపలా కాస్తాడు. ఇలా ఎప్పుడూ ఏదో ఒకటి చేస్తూనే వుంటాడు. ఆయనగారికి ఆరుగురు పిల్లలు. అంతా ఆరోగ్యంగానే వున్నారు. ఇన్ని చెప్పినాగానీ మనకు ఒక ప్రశ్న మాత్రం రాకుండా మానదు. అదే...నిద్రపోకుండా రాత్రుళ్లు ఈయనేం చేస్తాడబ్బా...అని. ఏముంది! ఆకాశంలో చుక్కలు లెక్కిస్తాడు.

రబ్బరు మనిషి

కొందరికి కాళ్లూ, చేతులూ... ఎటు పడితే అటు తిరిగిపోతాయి. దీనర్థం వాటంతటవే కదులుతాయని కాదు. ఆ వ్యక్తి ఎటు కావాలంటే అటు తిప్పగలడు అని. డేనియల్ బ్రౌనింగ్ స్మిత్ అలాంటివాడే. చూస్తున్నారుగా. తన రెండు చేతులను వెనక్కి ఎలా మెలితిప్పేశాడో! కుడిచేతిని ఎడమ చేతివైపుకు, ఎడమ చేతిని కుడి చేతి వైపుకు పంపి రెండు చేతులతో పాదాలను పట్టుకోలడు స్మిత్. ఇవే కాదు. ఇలాంటి ఎన్నో ఫీట్లు చేస్తాడు. బాస్కెట్‌బాల్, బేస్‌బాల్ చాలా సునాయాసంగా ఆడేస్తాడు. ఎన్నో టీవీ చానళ్లలో తన ఫీట్లు చేశాడు. ఇంటర్వ్యూలు ఇచ్చాడు. అసలు విషయం ఏమంటే అతగాడు ఇప్పటికి 5 సార్లు గిన్నిస్ బుక్ లోకి ఎక్కాడు. అతన్ని ఫాలో అయిపోతే తిప్పలు మాత్రం తప్పవండోయ్. మరి మన కాళ్లూ, చేతులూ అలా మెలికలు తిరగవు కదా.



మందుకొట్టే గుర్రం

బార్‌లో ఎవరు కనిపిస్తారు? చిన్నా పెద్దా... అంతా దర్శనమిస్తారు. అదే విదేశాల్లో అయితే ఆడవాళ్లూ అగుపిస్తారు. కానీ...బార్‌లో దర్జాగా మందేసే గుర్రాన్ని ఎక్కడైనా చూశారా! లేదుకదూ. అయితే మీరు స్టాఫోర్డ్‌షైర్ వెళ్లాల్సిందే. అక్కడ ఓ పబ్‌కి రోజూ ఓ గుర్రం వస్తుంది. అదీ ఒంటరిగా కాదు సుమా! తన యజమానితో కలిసి వస్తుంది. ఆయనగారు గత పదేళ్లగా ఈ బార్‌లో మందుపుచ్చుకుంటున్నాడు. దాని వయసు ఏడాది నిండిన దగ్గరనుంచి ఈ గుర్రాన్ని కూడా బార్‌కి తీసుకురాసాగాడు. మొదట కొద్ది రోజులు బార్ బయటే వున్నా...తర్వాత్తర్వాత లోపలికి వెళ్లసాగింది అది కూడా. తర్వాత తమాషాగా ఓ గ్లాస్‌లో మందు అందించారు. ఇంక అప్పటినుంచి ఆ రుచిని మర్చిపోలేదు! వదలకుండా లాగిస్తోంది. రోజూ ఒకే గ్లాస్‌లో మందు పోయాలి మళ్లీ. గ్లాసు మారిస్తే ఊరుకోదు. అంత గుర్తు దానికి. పోయించేవాడుంటే తాగడానికేం అంటారా!

నకిలీ పెన్‌డ్రైవ్‌లతో జరభద్రం



టెక్నాలజీ పెరిగాక అసలు...నకిలీ సమస్య బాగా పెరిగింది. కంప్యూటర్ వాడకంతోపాటే కంప్యూటర్ పరికరాల వాడకం కూడా ఎక్కువైంది. సీడీలు, పెన్‌డ్రైవ్‌లు...ఆ కోవకు చెందినవే. బ్రాండెడ్ వాటికి ఏమాత్రం తీసిపోకుండా నకిలీవాటిని మార్కెట్‌లోకి ప్రవేశపెడుతున్నారు. రోడ్లపక్కనే కాదు, పేరుమోసిన షాపుల్లో సైతం నకిలీ పెన్‌డ్రైవ్‌లు విరివిగా దొరుకుతున్నాయి. మరి వాటి వల్ల నష్టాలేంటి? వాటిని గుర్తించడమెలా? వంటి వివరాలు ....

కంప్యూటర్ బల్లపై మోచేతులాన్చి తల పట్టుకొని ఉసూరుమంటూ కూర్చున్నాడు రాజేష్. అప్పుడొచ్చాడు రాజేష్ స్నేహితుడు మహాకవి. మహాకవి ఏమిటా అని ఆశ్చర్యపోకండి.... ఆయనకు ఓ పెద్ద కవి కావాలని ఆశ. అందుకే మనోడు తన పేరును మహాకవిగా మార్చేసుకున్నాడు. తన అసలు పేరేమిటో ఎవరికీ తెలియదు. అందరికీ అతను మహాకవిగానే తెలుసు. కవి కావాలన్న అతని కోర్కెతే తీరలేదుకాని కంప్యూటర్‌కు సంబంధించిన విషయాలపై మాత్రం కాస్త పట్టుసాధించాడు. మనోడు రావడం రావడమే రాజేష్ వాలకం చూసి 'ఏంట్రా... నువ్వా ఆ వాలకం... నీ సొమ్మంతా ఎవడో దోచుకెళ్ళినట్టు...!' అనడిగాడు భుజం మీద తడుతూ.

రాజేష్‌కు తన మిత్రుడు మహాకవిని చూసి ప్రాణం లేచొచ్చినట్లయ్యింది. "రారా బాబూ రా... మంచి సమయానికొచ్చావ్..!" అన్నాడు ఆనందంగా.

"ఏంట్రా విషయం.... అంత టెన్షన్ పడుతున్నావ్..." అన్నాడు మహాకవి. ఇదేదో సీరియస్ ప్రోబ్లెమే అనుకుంటూ...

"ఏమీలేదురా... ఆఫీస్‌లో అర్జెంట్‌గా సబ్మిట్ చేయాల్సిన డేటా అంతా కరెప్ట్ అయ్యింది"

"ఇంతకీ ఏం చేశావేంటి? ఏం జరిగిందో వివరంగా చెప్పు...." అన్నాడు మహాకవి.

"ఏముంది.... రేపు ఆఫీస్‌లో ఇన్‌స్పెక్షన్ వుంది. పెండింగ్ వర్క్ అంతా ఈ పెన్‌డ్రైవ్‌లో కాపీ చేసుకొచ్చాను. వర్క్ అంతా పూర్తి చేశాను. ఇప్పుడు ఆ ఫైల్ మళ్ళీ పెన్‌డ్రైవ్‌లోకి కాపీ కావడంలేదు. సరే తెరిచి చూద్దాం అంటే ఓపెన్ కూడా కావడంలేదు..." అంటూ బిక్కమొహం వేశాడు రాజేష్.

"ఏదీ ఆ పెన్ డ్రైవ్ ఇలాతే...." అంటూ రాజేష్ ఇచ్చిన పెన్‌డ్రైవ్ తీసుకొని అటూఇటూ తిప్పిచూసి... చిరాగ్గా పెన్‌డ్రైవ్‌ను టేబుల్‌పై పడేసి.... 'నీకసలు బుద్ధుందా.... ఇలాంటి నకిలీ పెన్‌డ్రైవ్ కొనమని ఎవడు చెప్పాడు...' అనడిగాడు.

"నకిలీ పెన్‌డ్రైవా?"

"అవును అది నకిలీ పెన్‌డ్రైవ్... ఇంతకీ ఎక్కడ కొన్నావేంటి?"

"అదే రోడ్డు మీద అమ్ముతుంటే... తక్కువ రేటుకే వస్తోంది కదా అని కొన్నాను...."

'ఆ కక్కుర్తే నీ కొంప ముంచింది...' అంటూ నకిలీ పెన్‌డ్రైవ్‌ల వల్ల జరిగే నష్టాలను సవివరంగా చెప్పుకొచ్చాడు.

◆◆◆

కంప్యూటర్ అందుబాటులోకి వచ్చాక పని విషయంలో ఎక్కడలేని వెసులుబాటు కలుగుతోంది. కట్టల కొద్ది రికార్డులను రాయడం, మోయడం తప్పింది. ఇక ఈ యంత్రానికి బంధువుల్లా పుట్టుకొస్తున్న యాక్సెసెరీస్‌తోనైతే మాటల్లో చెప్పలేనంత సౌకర్యం. అలాంటి వాటిలో పెన్‌డ్రైవ్ ఒకటి. ఇది చూడ్డానికి చిన్న బాక్సులా వుంటుంది గాని... కంప్యూటర్ వాడేవారినడిగితే దీని అవసరం ఎంతో తెలుస్తుంది. ఏదైనా సమాచారాన్ని వెంట తీసుకెళ్ళాలంటే దానికోసం ఫైళ్లను, కాగితాలు చేత్తో పట్టుకెళ్ళాల్సిన పనిలేదు. ఈ బుల్లి డ్రైవ్‌లో సమాచారాన్ని కాపీ చేస్తే చాలు. దాన్ని ఎక్కడికైనా తీసుకెళ్ళవచ్చు. ఎప్పుడైనా ఉపయోగించుకోవచ్చు. అది సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్స్ అయినా, సినిమాలైనా ఏదైనా సరే ఈ పెన్‌డ్రైవ్‌లో బంధించవచ్చు. ఇంతమందికి రకరకాల సేవలందిస్తున్న ఈ పెన్‌డ్రైవ్‌లకు కూడా నకిలీ చీడ పట్టుకుంది.

కొందరు స్వార్థపరులు డబ్బుకు కక్కుర్తిపడి వీటికి డూప్లికేట్‌లను తయారు చేస్తూ కస్టమర్ల నడ్డి విరగ్గొడుతున్నారు. అసలుకు నకిలీకి తేడాలేనంతగా వీటి తయారీ వుంటోంది. అన్నీ కంపెనీ నుండి ఊడిపడ్డట్టు పక్కాగా వుంటాయి. బ్రాండెడ్ వాటికి ఏమాత్రం తీసిపోకుండా చాలా సులువుగా వినియోగదార్లను మోసం చేస్తున్నారు. మార్కెట్‌లో 2జిబి నుండి వివిధ బ్రాండ్లలో పెన్‌డ్రైవ్‌లు దొరుకుతున్నాయి. బ్రాండెడ్ పెన్‌డ్రైవ్ విలువ 400 నుండి 1200 రూపాయల వరకు వుంటుంది. వీటిలో దేన్నీ వదలకుండా ప్రతిదానికి డూప్లికేట్లను తయారు చేస్తున్నారు. కంపెనీవని నమ్మబలుకుతూ ఒక్కోదానిపై వందలకు వందలు నొక్కేస్తున్నారు. రోడ్లపక్కన కుప్పలుగా పోసి 50కి 100కు అమ్ముతుంటారు. పేరుమోసిన షాపుల్లో సైతం ఈ నకిలీ పెన్‌డ్రైవ్‌లు దొరుకుతున్నాయి. సరైన అవగాహన లేకపోవడం, ఏవి కంపెనీవో ఏవి నకిలీవో గుర్తించలేకపోవడంతో సులువుగా మోసపోతున్నారు.

నకిలీని గుర్తించడమెలా!

ఒరిజనల్ పెన్‌డ్రైవ్ మీది సీరియల్ నెంబర్‌ను దాని సీల్డ్‌కవర్ మీది నెంబర్‌తో పోల్చి చూసుకోవాలి. ఆ నెంబర్ సరిపోకున్నా, అసలు నెంబరే లేకున్నా అది నకిలీదేనని చెప్పవచ్చు. నకిలీ పెన్‌డ్రైవ్‌లపై ఈ నెంబర్లు వుండవు. ఆ పెన్‌డ్రైవ్‌లపై వుండే లోగో కూడా వేరుగా వుంటుంది.

నష్టాలు అన్నీ ఇన్నీ కావు

ఈ నకిలీ డ్రైవ్‌ల వల్ల అన్నీ నష్టాలే. రెండుమూడు సార్లు వాడిన తర్వాత ఎందుకూ పనికిరాకుండాపోతాయి. ఒకవేళ దానిలో ముఖ్యమైన డేటా సేవ్ చేస్తే ఇక అంతే సంగతులు. ఇక మరో నష్టం ఏమిటంటే ఈ నకిలీ డ్రైవ్‌లకు వైరస్ ఇట్టే పట్టేస్తుంది. దాన్ని కంప్యూటర్‌కు పెట్టినప్పుడు పెన్‌డ్రైవ్‌లోని వైరస్ కంప్యూటర్‌లో ప్రవేశించడంతోపాటు, కంప్యూటర్‌ను నాశనం చేస్తుంది. మరి దీన్ని తప్పించుకోవాలంటే గ్యారంటీ వున్నవాటినే కొనాలి. సీల్డ్ కవర్‌మీది నెంబరు, పెన్‌డ్రైవ్‌మీది నెంబర్ విషయంలో కూడా దొరక్కుండా కొందరు మాయగాళ్ళు జాగ్రత్తపడుతున్నారు. అటువంటప్పుడు ఆ కంపెనీ సర్వీసింగ్ సెంటర్‌కు వెళితే మన అనుమానం తీరిపోతుంది.

'బుల్లి పెన్‌డ్రైవ్ కోసం ఇంత తతంగం అవసరమా?' అంటే ఖచ్చితంగా అవసరమే. పెన్‌డ్రైవ్ రూ.400లే కావచ్చు. కానీ అది ఇన్‌సెర్ట్ చేసే కంప్యూటర్ మాత్రం వేలల్లో వుంటుంది. అందులో వుండే డేటా అంతకంటే ఎక్కువ విలువైంది కావచ్చు. ఒక్క నాసిరకం పెన్‌డ్రైవ్ వల్ల కంప్యూటర్ పాడుకావచ్చు. పెన్‌డ్రైవ్‌లోనో, కంప్యూటర్‌లోనో వున్న ముఖ్యమైన సమాచారం నాశనం కావచ్చు. దీనికంతటికీ కారణం తక్కువ రేటులో వస్తోంది కదా అని మనం కొనుగోలు చేసిన నకిలీ పెన్‌డ్రైవే. తస్మాత్ జాగ్రత్త.

- కె.ఎక్స్.రాజు

యువరాణి తీర్పు

బాల కథ

ఒక బీద బాటసారి తాను తెచ్చుకున్న ఆహారాన్ని తినడానికి ఓ చెట్టుకింద కూర్చున్నాడు. కొంచెం అన్నం, కొన్ని ఉడకబెట్టిన కూరగాయలు మాత్రమే అతని దగ్గర ఉన్నాయి.

ఆ చెట్టుకు ఎదురుగా ఒక దుకాణం ఉంది. ఆ దుకాణం యజమానురాలు మూకుట్లో చేపలు వేయించుతోంది.

ఆ బాటసారి భోజనం చేయటాన్ని ఆమె పరిశీలనగా చూసింది. అతడు తినడం పూర్తయ్యాక అతన్ని పిలిచి "వేయించిన చేపకు గాను ఒక వెండినాణెం ఇచ్చి వెళ్లు" అంది.

"అదేంటమ్మా! నేను నీ దగ్గర ఏం తీసుకోలేదే!" అన్నాడు బాటసారి అయోమయంగా.

"ఓయ్! చూస్తుంటే మోసగాడిలాగున్నావే. . నా దుకాణం నుండి వేయించుతున్న చేపల వాసన పీలుస్తూ నువ్వు సంతోషంగా భోంచేశావా? లేదా?" అందామె.

వాళ్లిద్దరూ అలా వాదోపవాదాలు చేసుకుంటుండగా చుట్టూ జనం చేరారు. కొందరు బాటసారి వైపు మరికొందరు దుకాణం యజమానురాలి వైపు మాట్లాడారు. అందరూ ఒక ... మాత్రం అంగీకరించారు. గాలి చేపలు వేయించుతున్న వైపు నుండి బాటసారి కూర్చున్నవైపు వీస్తున్నదని.

ఆఖరికి అందరూ కలిసి ఆ వివాదాన్ని యువరాణి దగ్గరికి తీసుకెళ్లారు.

అప్పుడు యువరాణి "తాను వేయించుతున్న చేపల వాసన బాటసారి పీల్చుకుంటూ భోజనం చేశాడని దుకాణం యజమానురాలు అంటోంది. బాటసారి కూడా తాను భోజనం చేస్తున్నప్పుడు గాలి అటువైపు నుండే తనవైపు వచ్చిందని ఒప్పుకున్నాడు. అందువల్ల అతను చేపల వాసన పీల్చినందుకు తగిన మూల్యం చెల్లించాలి" అంది.

"నిజానికి వేయించిన చేప వెల ఒక వెండినాణెం. అయితే చేప వాసన ధర వెండినాణెం నీడ. కాబట్టి నేను చెప్పినట్టు మీరిద్దరూ వెళ్లి ఎండలో నిల్చోవాలి. బాటసారి వెండినాణెం నీడను చూపించినప్పుడు, ఆమె నాణెం నీడను తీసుకుంటే సరిపోతుంది" అని యువరాణి తీర్పు చెప్పింది.

న్యాయమైన తీర్పుకు అందరూ హర్షధ్వానాలు చేశారు.

- మేకల మదన్‌మోహన్ రావు



దారి వెతుకుదాం

గడుగ్గాయిలూ... ఈ బుజ్జాయి తన గొలుసును పర్సు లోపలెక్కడో దాచేసింది. అది తీసుకుని వద్దామంటే దారి మర్చిపోయింది. మరి ఈ బుజ్జాయి జాగ్రత్తగా బయటికి రావడానికి సాయం చేయరూ!



నాలుగు త్రిభుజాలు ఎలా?

హలో పిల్లలూ... ఇక్కడ ఆరు అగ్గి పుల్లలు కనిపిస్తున్నాయి కదా. వాటితో నాలుగు త్రిభుజాలు చేయాలి. ప్రయత్నించండి మరి.



జవాబు: నాలుగు అగ్గి పుల్లల్ని చతురస్రంగా పెట్టి మధ్యలో రెండు పుల్లల్ని క్రాస్‌గా పెట్టండి. అప్పుడు నాలుగు త్రిభుజాలు వస్తాయి.

తేడాలు చెప్పేస్తే పోలా...

హాయ్... ఇక్కడున్న రెండు బొమ్మలు చూడ్డానికి ఒకేలా వున్నాయా? కానీ వాటిలో ఐదు తేడాలున్నాయి. అవి ఏంటో కనిపెట్టి చెప్పండే.



జవాబు:1.టెడ్డీబేర్, 2. రైలు బొమ్మ చక్రాలు, 3.టెడ్డీబేర్ పక్కనున్న బాక్సు హ్యాండిల్, 4. డ్రమ్‌స్టిక్స్, 5.పెద్ద బొమ్మ చేతిలో గిఫ్ట్ ప్యాక్.



నేర్చుకుందాం

ఎక్కడున్నాయో...

బుజ్జాయిలూ...కింద బొమ్మ చూశారుగా. చాలా బాగుంది కదా. అయితే ఇందులో కొన్ని వస్తువులు, ప్రాణులు, తినుబండారాలు దాగున్నాయి. అవేంటో కింద ఇచ్చాం. వాటిని బట్టి అవి ఇందులో ఎక్కడున్నాయో వెతికి సున్నా చుట్టండే.





మాటల కోట - 40

రూపకల్పన : కర్లపాలెం



అడ్డం :

1. తెలుగు సత్యభామ (3)
4. చైతన్యం అటునుండి (3)
7. రాబందు (2)
8. భంగము (3)
9. తెగ మాట్లాడే కాలువ (2)
10. వైకుంఠపాళి పటం నిండా కనిపించే రెండు బొమ్మలు (5)
12. అక్కడ కబుర్లు (3)
14. సీత వెంటే అటునుండి వచ్చే స్వాములు (3)
16. అరకప్పులో మళ్లీ అరలో అర కరిగిపోయింది (3)
17. ఎత్తరు కదా... తత్తర పాటులో ఒక్కరు ఎక్కలేకపోయారు (3)
18. అటునుండి చెరిగిపారేసేవి (3)
20. విరివిగా వద్దులే! (3)
22. అటునుండి రహస్యంగా ఒక పక్క చేరిపో! (5)
25. తీసేసిన తహసీల్దారు. పొడి అక్షరాల్లో (2)
26. చెదిరిన ధ్వని (3)
27. రిగమపద (2)
28. సి.పి.ఎం ప్రధాన కార్యదర్శి. చెదిరిపోయారు (3)
29. అంకెలమే... అదిరోహించము! (3)

నిలువు :

1. గజము కలిగిన పొడుగు కయ్యము (4)
2. బిచ్చగాడు అడిగేది ఇంత కబళము (2)
3. కొయ్యగుర్రం ఎక్కిన కేశవరావు తడబడ్డారు (4)
5. తిరగేసి కాల్చిపెట్టు (2)
6. క్యూబా విముక్తి పోరాట యోధుడు (4)
8. భస్మము- మధ్యది బూడిదయిపోయింది (2)
9. అంత ముచ్చెమటలా... సగమన్నా తుడుచుకో ! (2)
10. పాటక జనం చేరి ఆనందించే గాన సభ (5)
11. పిలువకురా! అలుగకురా!..... నను ఓ రాజా! పలుచన చేయకురా! (5)
13. అక్కడ అటూఇటూ అయింది (3)
15. తిరగేస్తే మాత్రమేంటి... డబ్బు డబ్బే! (3)
18. చెదిరిన ఒడ్డు. ఒకటే కాదు చాలా! (4)
19. అరకాయ పుచ్చుకుంటే చాలు. బికారి కూడా బిల్‌గేట్స్ బాడీలోకి దూరిపోగల విద్య (4)
21. కులాసా చిరునామా (4)
23. స్త్రీ ఉగ్రావతారం (2)
24. తిరగబడిన వడ్డాది పాపయ్య (2)
27. మరీ అంత నిక్కు వద్దు... కొమ్ము విరిచేయండి ! (2)

మాటలకోట - 39జవాబు

1 శి	2 లు	3 వ		4 న	ల్ల	5 గొ	డు	6 గు
	7 కి	ద్దం	అ			బ్బె		డ్డు
8 రా	ము	డే			9 అ	మ్మ	10 లు	
చ		11 డ	జ		ష్ప		ర	12 క
13 అ	ర	బ్బు		14 స్త్రీ		15 టి	ప్ప	ణి
16 క	త్తా		17 మూ		18 నం	పా		క
	19 లు	20 తా	జీ		21 త	ల	పు	లు
23 జా		మ			24 వే	ము	ల	
25 వ	డ్డె	ర	చం	డీ		26 పా	వ	లా

చిట్టిగాడికి చిన్ని ముద్దు

నల్లమల కొండల మధ్య ఒక దట్టమైన అడవి ఉంది. దాని పేరు నల్లడవి. అందులో ఒక బడి ఉంది. ఆ బడిలో అడవి జంతువుల పిల్లలు చక్కగా చదువుకునేవి. అక్కడ చదువుతోపాటు వాటికి ఆటపాటలు కూడా నేర్పేవారు. ఓ సారి పాఠశాల వార్షికోత్సవం జరిపారు. ఈ సందర్భంగా జరిగిన ఆటపాటల పోటీల్లో గెలిచిన వారికి బహుమతులు ఇచ్చారు. అందులో చెవులపిల్లి చిట్టిగాడికి మొదటి బహుమతి వచ్చింది.

వాడు సంతోషంగా ఇంటి దారి పట్టాడు. ఇంటికి వెళ్ళగానే అమ్మకు చూపించాడు. అమ్మ సంతోషంతో పొంగిపోయింది. అమ్మమ్మకు ఆ విషయం తెలియజేయమంది.

చిట్టిగాడి అమ్మమ్మ వాళ్లూరికి దగ్గరలో ఉన్న చిట్టడవిలో ఉంటుంది. వాళ్ళ అమ్మమ్మకు ఎవరి ద్వారా కబురు పంపాలా అని చిట్టిగాడు ఆలోచిస్తూ బయటికి వచ్చాడు.

అదే సమయంలో ఆ దారిన వెళ్తున్న అడవి కోడి-

"ఏంటల్లుడు! ఏమిటి సంగతి? చేతిలో ఏంటది?" అని అడిగింది.

"అత్తమ్మా ఈ రోజు మా బడిలో పాటల పోటీలు పెట్టారు. నాకు మొదటి బహుమతి వచ్చింది. దాన్ని అమ్మమ్మకు పంపించాలి. ఎలా పంపాలా అని ఆలోచిస్తున్నాను" అన్నాడు చిట్టి.

"దానికి అంత ఆలోచించాలా? నేను చిట్టడవికే సంతకు వెళ్తున్నాను. నాకు ఇవ్వు. నేను ఇస్తాను" అంది.



చిట్టిగాడు ఆనందంగా తనకు వచ్చిన బహుమతిని ఇచ్చాడు. అడవికోడి దాన్ని బుట్టలో పెట్టుకుని చిట్టడవిలో ఉంటున్న చిట్టిగాడి అమ్మమ్మ దగ్గరికి వెళ్లి బహుమతిని ఇచ్చింది. చిట్టిగాడి అమ్మమ్మ ఆ బహుమతిని చూచి ఆనందంతో పొంగిపోయింది.

మనవడికి బహుమతిగా ఓ ముద్దును అడవికోడి బుగ్గకు పెట్టి అది తన మనవడికి అందివ్వమంది. అడవికోడి ఆ ముద్దును తీసుకుని బయలుదేరింది.

అడవికోడి వస్తూ ఉండగా దారిలో పాత మిత్రులు కలిశారు. ఆ రోజుకు అక్కడే ఉండి పొమ్మన్నారు. దాంతో అడవికోడి నల్లడవికి పోతున్న తాబేలును ఆపి "తాబేలన్నా! మనూరి చిట్టిగాడికి ముద్దు ఇవ్వాలి. ఆ ముద్దు వాళ్ళ అమ్మమ్మ ఇచ్చింది. నువ్వు దయచేసి వాడికి ఆ ముద్దు అందజేస్తావా?" అని అడిగింది?

"అలాగే!" అంది తాబేలు.

అడవికోడి తాబేలుకు ముద్దు ఇచ్చింది.

తాబేలు ముద్దుతో బయలు దేరింది. దారిలో ఓ చెరువును చూసింది. స్నానం చేద్దామని అనుకుంది. వెంటనే నీటిలో దూకింది.

చెరువు గట్టుమీదుగా పోతున్న బాతు "ఎవరది"? అంది.

" నేనే బాతు భయ్యా! నువ్వు ఎక్కడికి బయలుదేరావు?" చెరువు నీటిలో హాయిగా ఈతకొడుతూ అడిగింది.

"నేను మా అత్తగారి ఊరెళ్తున్నాను!" అంది బాతు.

"మనూరి చిట్టిగాడికి ఓ ముద్దు ఇవ్వాలి. ఆముద్దు వాళ్ళ అమ్మమ్మ ఇచ్చింది. దయచేసి నువ్వు వాడికి ఆ ముద్దు అందజేస్తావా?" అని అడిగింది తాబేలు.

"అలాగే !" అంది బాతు.

"నేను చెరువులో ఉన్నాను. వచ్చి ముద్దు తీసుకో అంది తాబేలు.

బాతు తాబేలు దగ్గరకి వెళ్ళింది. తాబేలు బాతు బుగ్గ మీద ముద్దు పెట్టింది. బాతు ఆ ముద్దు తీసుకుని బయలుదేరింది. ప్రయాణంలో అలసి ఎక్కడైనా కాసేపు విశ్రాంతి తీసుకుందామా అని చూసింది. అదే సమయంలో ఓ కోతి కనిపించింది.

వెంటనే బాతు " కోతిబావా! కోతిబావా! మనూరి చిట్టిగాడికి ఓ ముద్దు ఇవ్వాలి. ఆ ముద్దు వాళ్ళ అమ్మమ్మ ఇచ్చింది. నువ్వు దయచేసి వాడికి ఆ ముద్దు అందజేస్తావా?" అని అడిగింది.

" అలాగే !" అంది కోతి సంతోషంగా.

బాతు కోతికి ముద్దు ఇచ్చింది. కోతి చెంగు చెంగుమంటూ ఓ కొమ్మ మీద నుండి మరో కొమ్మ మీదికి ఎగురుతూ కొద్ది దూరం ముందుకు పోయింది.

హఠాత్తుగా దానికి ఓ అందమైన ఆడ కోతి కనిపించింది. వెంటనే అది ఆడ కోతిని ముద్దు పెట్టుకుంది. ఆడకోతి వెంటనే ఆ ముద్దును తిరిగిచ్చింది. మగకోతి వెంటనే తిరిగిచ్చింది.

అంతలో అక్కడికి అడవికోడి వచ్చింది. "ఏం చేస్తున్నారు? మీకు ముద్దులెక్కువయ్యాయి" అంది

"అబ్బే, ఇది చెవుల పిల్లి చిట్టిగాడి ముద్దు. వాడి అమ్మమ్మ వాడి కోసం పంపింది" అంది కోతి.

"ఓహో! నేను తాబేలు ద్వారా పంపిన ముద్దు ఇంకా ఇక్కడే ఉందా? ఇప్పుడు ఎవరి దగ్గరుందా ముద్దు" అని అడిగింది.

"ఈ ఆడకోతి దగ్గర" అంది మగ కోతి.

అడవికోడి ఆ ముద్దును వెనక్కు తీసుకుంది. అక్కడి నుంచి చిట్టిగాడి దగ్గరికి పరుగు తీసింది. అది చిట్టిగాడికి ముద్దిచ్చింది.

"ఇది మీ అమ్మమ్మ నీకు పంపిన ముద్దు. నీవు పంపిన బహుమతికి బహుమతి" అంది అడవికోడి.

"నేనూ ఓ ముద్దును ఆమెకు ఇస్తాను. తిరిగి తీసుకెళ్ళవా?" అడిగాడు చిట్టిగాడు.

"ఓహ్ ! నో!నో! ఇప్పటికే ముద్దులు చాలా మారాయి. ఇంక నావల్ల కాదు బాబోయ్" అంటూ తుర్రున పారిపోయింది అడవి కోడి.

- రంగనాథ రామచంద్రరావు

అన్నీ... పెన్సిల్ అద్భుతాలే!

కొంతమంది పెన్సిల్‌తో అందమైన కళాఖండాలు సృష్టిస్తుంటారు. మనం చూస్తూనే వుంటాం. అందులో పెద్దగా ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదనిపిస్తుంది. ఎందుకంటే ప్రతిచోటా జరుగుతున్నదే కనుక. మరి ఆ పెన్సిల్ లోపల వుండే లెడ్ మీద మనసులోని ఆలోచనలను ఆవిష్కరిస్తే... అదిరిపోతుందికదూ. అదే జరిగిందిక్కడ. మీముందర వున్నవన్నీ ఆ అద్భుతాలే. అంత చిన్న పెన్సిల్ మీద మనకు ప్రతి రోజూ, ప్రతి నిముషం ఎదురయ్యే...అవసరమయ్యే వస్తువులను చెక్కడమంటే చిన్న విషయం కాదు. ఒక్కడాల్టన్ గెట్టికే చెల్లింది. చూడండి! పిన్నల నుంచి పెద్దల వరకు ఉపయోగించే 26 ఆంగ్ల అక్షరాలను ఎ టు జడ్ పెన్సిళ్ల మీద ఎలా నిలబెట్టేశాడో. అవేనా! చొక్కా గుండీ, కాలి బూటు, హృదయం, తాళం, సుత్తి, రంపం, పోస్ట్ డబ్బా, కుర్చీ, ఇనుప గొలుసులు, హుక్కా మనిషి, ఒంటె...ఇలా ఎన్నెన్నో తయారుచేసేశాడు. వీటిని ఎటువంటి భూతద్దాలు ఉపయోగించకుండా పాతికేళ్లగా చేస్తున్నాడతను. కానీ ఎలా సాధ్యమైంది? అంటే ...చెప్పడం కూసింత కష్టమే. బ్రెజిల్‌కు చెందిన డాల్టన్ వృత్తి చెక్కపని. ప్రవృత్తి పెన్సిల్‌పై బొమ్మలు చెక్కడం. మొట్టమొదటిసారిగా పాఠశాలలో చదువుకునే రోజుల్లో తన మిత్రుడి పేరును పెన్సిల్‌మీద చెక్కి పుట్టినరోజు సందర్భంగా బహూకరించాడు. అప్పుడు నేస్తాలు అతన్ని ఎంతగానో అభినందించారు. అదే అతనిలో టానిక్‌లా పనిచేసింది. ఆ క్షణం నుంచి పెన్సిల్ ఆర్ట్ మీద ఆసక్తి పెంచుకున్నాడు. ఐదు పదుల వయసులోనూ కేవలం పెన్సిల్, బ్లేడు, సూది, చాకు ఉపయోగించి కళాఖండాలను సృజించి చూపరులను అబ్బురపరుస్తూనే వున్నాడు.

డాల్టన్ గెట్టి